కోటగిరి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో..
వీక్షించండి చానల్
NS99 CHANNEL
దగా స్థానంలో నిగా వేసే చానల్

దగా స్థానంలో నిఘా వేసే జాతీయ దిన పత్రిక

నీలగిరి శంఖారావం

సమగ్ర సమాచార దర్శిని

తెలుగు జాతీయ దినపత్రిక

నల్లగొండ | సంపుటి :05 | సంచిక :192 | ఎడిటర్ : కోటగిరి చంద్రశేఖర్ | శనివారం 21-11-2026 | పేజీలు : 4 | వెల : రూ. 3/-

సీఎం హుందాతనాన్ని కాపాడుకోవాలి: ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి



గజ్వేల్: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సిద్ధిపేట పర్యటనలో ప్రజా సమస్యలు, అభివృద్ధి కార్యక్రమాలపై మాట్లాడకుండా కేసీఆర్, హరీశ్ రావు, వారి కుటుంబంపై వ్యక్తిగత విమర్శలకే ప్రాధాన్యం ఇవ్వడం దురదృష్టకరమని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి విమర్శించారు. సీఎం పర్యటనతో తమ ప్రాంతానికి అభివృద్ధి, సంక్షేమ పథకాలకు నిధులు వస్తాయని, పెండింగ్ ప్రాజెక్టు కాలువలకు మోక్షం కలుగుతుందని, రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా, రైతుబంధు అందుతాయని, రోడ్లు బాగుపడతాయని ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారని అన్నారు. కానీ రేవంత్ రెడ్డి మాత్రం తిట్ల పురాణంతో సరిపెట్టారని మండిపడ్డారు.గజ్వేల్‌లో బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఒంటేరు ప్రతాప్ రెడ్డితో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో జిల్లాల పర్యటనకు వచ్చినప్పుడు ముందుగా స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులతో మాట్లాడి ప్రాంతంలోని సమస్యలను తెలుసుకునేవారని గుర్తు చేశారు. విద్యుత్, సాగునీరు, రోడ్లు, అభివృద్ధి పనులకు సంబంధించిన సమస్యలను సభలో ప్రస్తావించి, అవసరమైన నిధులు వెంటనే మంజూరు చేసేవారని తెలిపారు.కేసీఆర్ అభివృద్ధి, సంక్షేమ పథకాల స్ట్రిప్ట్‌తో వస్తే.. రేవంత్ రెడ్డి విమర్శలు, వ్యక్తిగత దూషణల స్ట్రిప్ట్‌తో వస్తు?నారని ఎద్దేవా చేశారు. కానీ సీఎం స్థాయిలో ఉన్న వ్యక్తి మాట్లాడే మాటలకు ఒక హుందాతనం ఉండాలని, దిగజారుడు వ్యాఖ్యలు చేయడం వల్ల ముఖ్యమంత్రి పదవికే గౌరవం తగ్గుతుందని అన్నారు. ఎక్కడికి వెళ్లినా కేసీఆర్ కుటుంబాన్ని విమర్శించడం మానుకోవాలని, ప్రజలు ఇలాంటి వ్యాఖ్యలను హర్షించడం లేదని పేర్కొన్నారు.తన సొంత పార్టీ ఎమ్మెల్యేలే ప్రభుత్వంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారని కొత్త ప్రభాకర్ రెడ్డి అన్నారు. ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ప్రభుత్వ పనితీరుపై వ్యాఖ్యలు చేస్తున్నారని, ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి నిధులు విడుదల కావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారని గుర్తు చేశారు. సొంత పార్టీ ఎమ్మెల్యేల సమస్యలు పరిష్కరించలేని ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నాయకుల వెంట పడటం ఏమిటని ప్రశ్నించారు. కేసీఆర్ కుటుంబంపై చేసిన వ్యాఖ్యల ను తీవ్రంగా ఖండిస్తున్నామని, రేవంత్ రెడ్డి తన మాటతీరును మార్చుకోవాలని సూచించారు.

దీక్షా దివస్‌కు తరలిరండి..



గోదావరిఖని, తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం కేసీఆర్ ఆమరణ దీక్ష చేపట్టిన రోజును పురస్కరించుకుని ఈ నెల 29న కరీంనగర్ జిల్లా అలుగునూరులో నిర్వహించే దీక్షా దివస్ కార్యక్రమానికి తెలంగాణవాదులు పెద్ద ఎత్తున తరలిరావాలని మాజీ పార్లమెంటు సభ్యుడు బాల్క సుమన్ పిలుపునిచ్చారు. శుక్రవారం పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం కేసీఆర్ తెలంగాణ రాష్ట్ర సమితిని స్థాపించి 14 ఏళ్లపాటు సుదీర్ఘ పోరాటం చేశారని తెలిపారు. కేసీఆర్ ఆమరణ దీక్ష చేపట్టిన అనంతరమే అప్పటి కేంద్ర ప్రభుత్వం దిగివచ్చి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు అంగీకరించిందన్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని నవంబర్ 29న నిర్వహించే దీక్షా దివస్ కార్యక్రమానికి భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరవుతారని బాల్క సుమన్ తెలిపారు. రామగుండం నియోజకవర్గంలోని గులాబీ సైనికులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్, నాయకులు కౌశిక్ హరి, లక్ష్మీనారాయణతో పాటు పలువురు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే రేఖానాయక్ ఇళ్లపై ఈడీ మెరుపు దాడులు..



నిర్మల్ : నిర్మల్ జిల్లా ఖానాపూర్ మాజీ ఎమ్మెల్యే అజ్మీరా రేఖానాయక్‌కు సంబంధించి కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) కుంభకోణం కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దూకుడు పెంచింది. ఈ ఉదయం ఖానాపూర్ తో పాటు హైదరాబాద్‌లోని ఆమె నివాసాల్లో ఈడీ అధికారులు ఏకకాలంలో ముమ్మర సోదాలు చేపట్టారు. ఖానాపూర్ మండలం సత్తెనపల్లి వద్ద రేఖానాయక్‌కు చెందిన ఏఆర్ఎస్ ఆగ్రో ఇండస్ట్రీస్ రైస్ మిల్లుకు ప్రభుత్వం మిల్లింగ్ నిమిత్తం ధాన్యాన్ని కేటాయించింది. అయితే, 2022-23, 2023-24, 2024-25 రబీ సీజన్లకు సంబంధించి ప్రభుత్వం ఇచ్చిన ధాన్యంలో పెద్ద మొత్తంలో బియ్యాన్ని తిరిగి ప్రభుత్వానికి అప్పగించకుండా పక్కదారి పట్టించినట్లు ఆరోపణలు వచ్చాయి. దీని విలువ మార్కెట్‌లో సుమారు రూ.40.96 కోట్లు ఉంటుందని పౌరసరఫరాల శాఖ గుర్తించింది. గత ఆగస్టు నెలలో విజిలెన్స్ అధికారులు నిర్వహించిన తనిఖీల్లో భారీగా ధాన్యం నిల్వలు మాయమైనట్లు తేలింది. దీనిపై జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి ఫిర్యాదు చేయడంతో ఖానాపూర్ పోలీస్ స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదైంది. ఈ కేసు ఆధారంగా మనీలాండరింగ్ కోణంలో దర్యాప్తు చేపట్టిన ఈడీ అధికారులు తాజాగా రంగంలోకి దిగి సోదాలు చేస్తున్నారు. ప్రస్తుతం ఖానాపూర్‌లోని రేఖానాయక్ నివాసం వద్ద విజిలెన్స్, స్థానిక పోలీసు బలగాలు భారీగా మోహరించాయి.

నా యాక్సిడెంట్‌పై తప్పుడు ప్రచారం చేస్తే బట్టలు విప్పి నిలబెడతా..



హైదరాబాద్,అసెంబ్లీ మీడియా హాల్ వేదికగా ప్రభుత్వ విప్ బల్మూరి వెంకట్ బీఆర్ఎస్ ముఖ్య నేతలు హరీష్ రావు, కేటీఆర్ లక్ష్యంగా తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. సిద్దిపేటలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్వహించిన బహిరంగ సభ, ఆ తర్వాత చోటుచేసుకున్న రాజకీయ పరిణామాలపై ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ అంతర్గత కుమ్ములాటల నుంచి మొదలుకొని, జాతీయ స్థాయి వ్యాపారవేత్తలతో రహస్య భేటీల వరకు పలు అంశాలను ప్రస్తావిస్తూ ప్రతిపక్ష నేతలకు ఘాటు సవాళ్లు విసిరారు.

హరీష్ రావు బీజేపీలోకి వెళ్లడం పక్కా

సిద్దిపేటలో సీఎం సభ పెట్టడంపై కేటీఆర్ వర్గం లోలోపల సంతోషంగా ఉందని.. హరీష్ రావును తిడుతుంటే కేటీఆర్ ఆనందిస్తున్నారని బల్మూరి వెంకట్ సంచలన ఆరోపణలు చేశారు. బీజేపీ నేతలతో మాట్లాడలేదని ప్రమాణం చేయాలని సవాల్ విసిరితే హరీష్ రావు ఇప్పటికీ స్పందించలేదన్నారు. దీనిని బట్టి ఆయన బీజేపీతో టచ్‌లో ఉన్నారని ఒప్పుకున్నట్టేనని విమర్శించారు. రాబోయే రోజుల్లో హరీష్ రావు బీజేపీ తీర్థం పుచ్చుకోవడం ఖాయమని జోస్యం చెప్పారు. సిద్దిపేట అభివృద్ధికి సీఎం రూ.540 కోట్లు కేటాయిస్తే కృతజ్ఞత చెప్పాల్సింది పోయి ఇష్టానుసారంగా మాట్లాడటం తగదన్నారు. ఆంధ్రా కాలేజీలకు పాలు అమ్మిన మాట వాస్తవం కాదా అని నిలదీసిన ఆయన, రెండోసారి ఇరిగేషన్ మంత్రిగా ఎందుకు కొనసాగించలేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

అదానీ భేటీపై సవాల్

కేటీఆర్ తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన బల్మూరి వెంకట్, ఆయనను ఉద్దేశించి ఘాటు పదజాలంతో విరుచుకుపడ్డారు. తనకు రోడ్డు ప్రమాదం జరిగితే.. కేటీఆర్‌పై విమర్శలు చేసినందుకే అలా జరిగిందని బీఆర్ఎస్ సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేయడం సిగ్గుచేటని మండిపడ్డారు. చెన్నైలో అనిల్ రెడ్డి కుమార్తె వివాహ వేడుకలో ప్రముఖ పారిశ్రామికవేత్త అదానీని కలవడానికి కేటీఆర్ ప్రయత్నించిన మాట నిజమా కాదా అని ప్రశ్నించారు. అదానీ కలవడానికి నిరాకరిస్తే.. జగన్ వెంట వెళ్లి ఆయన కాళ్లు మొక్కింది వాస్తవం కాదా అని నిలదీస్తూ.. దమ్ముంటే పిల్లల మీద ఒట్టేసి నిజం చెప్పాలని సవాల్ విసిరారు.

నిజస్వరూపం బయటపెడతా.. బల్మూరి వార్నింగ్

మొన్నటి వరకు రాజకీయ విమర్శలను ఒక పరిమితికి లోబడి మాత్రమే చేశానని, కానీ తన ప్రమాదంపై సోషల్ మీడియాలో చేసిన నీచపు ప్రచారం చూశాక మరో అడుగు ముందుకు వేయాలని నిర్ణయించుకున్నానని బల్మూరి వెంకట్ స్పష్టం చేశారు. కేటీఆర్ అసలు రంగు, నిజస్వరూపం త్వరలోనే ప్రజల ముందు బట్టబయలు చేస్తానని హెచ్చరించారు. పూర్తి ఆధారాలతో సమాజం ముందు నిలబెడతానని ఆయన తీవ్ర స్థాయిలో వార్నింగ్ ఇచ్చారు.

సిద్దిపేటలో సీఎం సభ చూసి హరీశ్‌రావుకు గుబులు : ఆది శ్రీనివాస్



హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సిద్దిపేట సభ విజయవంతం కావడంతో బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు ఓర్వలేక పోతున్నారని ప్రభుత్వ విప్ ఆదిశ్రీనివాస్ అన్నారు. సిద్దిపేటలో ర్యాలీ, సభలో పాల్గొన్న జనం స్పందన చూసి హరీశ్‌కు గుబులు పుట్టిందన్నారు. అందుకే సీఎం సభపై ఆయన అక్కసు వెళ్లగక్కుతున్నారని విమర్శించారు. సిద్దిపేటకు రూ.వందల కోట్ల నిధులు ఇస్తున్న సీఎంను అభినందించడానికి హరీశ్‌రావుకు మాటలు రావడం లేదన్నారు. తెలంగాణ పబ్లిక్ స్కూల్‌కు శంకుస్థాపన చేస్తే ఆయన జీర్ణించుకోలేకపోతున్నారని.. సీఎంకు కనీసం ధన్యవాదాలు తెలపలేదని ఆక్షేపించారు. ఇందిరమ్మ బీమా పథకాన్ని సిద్దిపేటలో ప్రారంభిస్తే హరీశ్ స్పందించలేదన్నారు. అమరవీరుడు శ్రీకాంతాచారి తల్లిని సిద్దిపేట వేదికపై చూసి ఆయన హైరానా పడుతున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజాభిమానంతో మరోసారి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. సిద్దిపేటలో కాంగ్రెస్ అభ్యర్థి విజయం సాధిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

సీఎంపై వ్యాఖ్యలు హాస్యాస్పదం: అద్దంకి దయాకర్

సీఎం రేవంత్‌రెడ్డిపై హరీశ్‌రావు చేసిన వ్యాఖ్యలు హాస్యాస్పదమని ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్ అన్నారు. హరీశ్ రావు తీరును తెలంగాణ సమాజం గమనిస్తోందన్నారు. సీఎం దగ్గరకు వచ్చి నియోజకవర్గ అభివృద్ధిపై హరీశ్‌రావు ఏనాడూ అడగలేదని విమర్శించారు. ప్రతిపక్ష ఎమ్మెల్యేల నియోజకవర్గాలకు కూడా సీఎం రేవంత్ వెళ్లి అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభిస్తున్నారన్నారు. రాజకీయంగా బీఆర్ఎస్‌ను ప్రజలు భూస్థాపితం చేశారన్నారు.

అదానీ జేబులోంచి ప్రజాధనాన్ని తెలంగాణకు తెస్తున్నా..



హైదరాబాద్,శుక్రవారం హైదరాబాద్‌లో ఏబీపీ నెట్‌వర్క్ నిర్వహించిన 'సదరన్ రైజింగ్ సమ్మిట్ 2026' వేదికగా ఆయన మాట్లాడారు. గతంలో ఇచ్చిన వివరాలతో పాటు మూడేళ్ల పాలనకు తాను వేసుకున్న మార్కులు, అదానీ గ్రూప్ పెట్టుబడులు, సింగరేణి నిధుల వినియోగంపై వచ్చిన విమర్శలకు సీఎం ఈ సదస్సులో సూటిగా సమాధానమిచ్చారు.

నా పాలనకు 6.5 మార్కులు వేసుకుంటా!

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడేళ్లు పూర్తవుతున్న సందర్భంగా.. ముఖ్యమంత్రిగా మీ పనితీరుకు ఎన్ని మార్కులు వేసుకుంటారని అడిగిన ప్రశ్నకు రేవంత్ రెడ్డి ఆసక్తికర సమాధానమిచ్చారు. తన పాలనకు 10కి 6.5 మార్కులు వేసుకుంటానని ఆయన చెప్పారు. గత మూడేళ్లలో 65 శాతం హామీలను అమలు చేశామని, మిగిలిన రెండేళ్ల పదవీకాలంలో 'తెలంగాణ రైజింగ్ 2047' లక్ష్యాలను చేరుకునేలా సమగ్ర విధానాలను రూపొందించామని వివరించారు.

అదానీ జేబులోంచి ప్రజాధనాన్ని తెలంగాణకు తెస్తున్నా!

అదానీ గ్రూప్ ఛైర్మన్ గౌతమ్ అదానీని కలవడం, తెలంగాణలో పెట్టుబడులకు ఆహ్వానించడంపై వస్తున్న విమర్శలను సీఎం రేవంత్ రెడ్డి గట్టిగా తిప్పికొట్టారు. "తెలంగాణ అభివృద్ధికి పెట్టుబడులను ఆహ్వానించడంలో తప్పేమీ లేదు. ప్రధాని మోదీ దేశ ప్రజల సొమ్మును అదానీ చేతిలో పెడుతుంటే.. నేను మాత్రం ఆ అదానీ జేబులోంచి ప్రజాధనాన్ని బయటకు తీసి తెలంగాణలో పెట్టుబడుల రూపంలో పెట్టిస్తున్నాను" అని సీఎం ఘాటుగా వ్యాఖ్యానించారు.

సింగరేణి నిధులు & రొనాల్డో రాకపై క్లారిటీ

ఫుట్‌బాల్ దిగ్గజం లియోనెల్ మెస్సీని హైదరాబాద్‌కు ఆహ్వానించడం, ఆ కార్యక్రమానికి సింగరేణి నిధులను వాడటంపై వచ్చిన విమర్శలపై సీఎం స్పందించారు. ఇప్పటికే మెస్సీని తీసుకొచ్చామని, త్వరలోనే మరో ప్రపంచ ప్రఖ్యాత ఫుట్‌బాల్ స్టార్ క్రిస్టియానో రొనాల్డోను కూడా హైదరాబాద్‌కు రప్పించేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తోందని తెలిపారు. అయితే, రొనాల్డో పర్యటనకు సంబంధించిన తేదీలు ఇంకా ఖరారు కాలేదని స్పష్టం చేశారు. తనకు మెస్సీ, మారడోనా అంటే ఎంతో ఇష్టమని పేర్కొన్నారు.

ఇక్కడ కేసీఆర్ వర్సెస్ రేవంత్.. బీజేపీ కేవలం ప్రేక్షకుడే!

తెలంగాణ రాజకీయాల్లో బీజేపీ పాత్ర ఏమీ లేదని, ఇక్కడ పోటీ ఎప్పుడూ కేసీఆర్ వర్సెస్ రేవంత్ రెడ్డి అన్నట్లుగానే ఉంటుందని సీఎం అన్నారు. "తెలంగాణలో బీజేపీ కేవలం ఒక ప్రేక్షకుడిలా బయట కూర్చుని చప్పట్లు కొట్టాల్సిందే. ఇటీవల జరిగిన జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ఆ పార్టీ డిపాజిట్ కూడా కోల్పోయింది. బీజేపీకి బలం ఉన్న రాష్ట్రాల్లో 'ఓట్ల చోరీ'కి పాల్పడుతోంది కానీ, ఇక్కడ ఆ అవకాశం లేదు" అని విమర్శించారు. తెలంగాణలో తమ బలం పెంచుకుంటున్నామని బీజేపీ నేతలు చేస్తున్న వాదనల్లో నిజం ఉంటే.. ప్రధాని నరేంద్ర మోదీ గానీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా గానీ హైదరాబాద్ లోక్‌సభ స్థానం నుంచి ఒవైసీపై పోటీ చేసి గెలవాలని సీఎం సవాల్ విసిరారు.

తెలంగాణ నీటి హక్కులను ఎపికి దోచిపెడుతున్నారు: హరీష్ రావు



హైదరాబాద్: సిఎం రేవంత్ రెడ్డి ప్రస్టేషన్‌లో అసభ్య పదజాలం ఉపయోగించారని బిఆర్ఎస్ మాజీ మంత్రి హరీష్ రావు ఆరోపించారు. సిఎం మాట్లాడిన తీరు, చేసిన వ్యాఖ్యలను ప్రజలు గమనించారని అన్నారు. సిద్దిపేటలో రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై హరీశ్ రావు తీవ్రంగా స్పందించారు. రేవంత్‌పై హరీశ్ రావు విమర్శలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. గురువారం సిద్దిపేటలో జరిగిన కాంగ్రెస్ ప్లీనరీ సమావేశంలో ఇతర జిల్లాల నుంచి కార్యకర్తలను తరలించారని విమర్శించారు.రేవంత్ రెడ్డి మోసపూరిత విధానాల వల్లే తెలంగాణకు అన్యాయం జరుగుతోందని విమర్శించారు. అబద్ధాలు చెప్పడంలో రేవంత్ రెడ్డికి ఆస్కార్ అవార్డు ఇవ్వొచ్చంటూ, తెలంగాణ హక్కులను ఆంధ్రప్రదేశ్‌కు దోచిపెడుతున్నారని, నిన్నటి సభలో మాట్లాడిన అంశాలకు, పత్రికల్లో ఇచ్చిన ప్రకటనలకు పొంతన లేదన్నారు.కెటీఆర్ కొన్ని అంశాలను బయటపెట్టిన తర్వాతే గత తేదీలతో లేఖలు వస్తున్నాయని, సీఎం గంటసేపు చేసిన ప్రసంగంలో 140 సార్లు తమ పేర్లను ప్రస్తావించారని పేర్కొన్నారు. ప్రజలకు ఉపయోగపడే అంశాలు, అభివృద్ధి కార్యక్రమాలపై స్పష్టత ఇవ్వలేదని విమర్శించారు.

తెలంగాణ నీళ్లపై కీలక వ్యాఖ్యలు

తెలంగాణ నీటిని ఆంధ్రప్రదేశ్‌కు తరలించే విషయంలో సీఎం పరోక్షంగా సహకరిస్తున్నారని, ఎపి సిఎం చంద్రబాబు నాయుడు జలదోపిడీకి రేవంత్ రెడ్డి సహకరిస్తున్నారని, గోదావరి జలాలు తరలిపోతున్నా ప్రభుత్వం సరైన చర్యలు తీసుకోవడం లేదని మండిపడ్డారు. దేవాదుల ప్రాజెక్టు వద్ద ఎన్ని గంటల పాటు మోటార్లు నడిపారో ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నీటి వినియోగం, ప్రాజెక్టుల నిర్వహణకు సంబంధించిన వివరాలను ప్రజల ముందు ఉంచాలని కోరారు.

కాంగ్రెస్ ప్రభుత్వంపై అవినీతి ఆరోపణలు

కాంగ్రెస్ ప్రభుత్వంలో 20 శాతం కమీషన్లు తీసుకుంటున్నారంటూ ఆ పార్టీ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను కూడా హరీశ్ రావు ప్రస్తావించారు. బిజెపితో కాంగ్రెస్ ప్రభుత్వం ఎలా కుమ్మక్కయిందనే అంశాలను తాము ప్రశ్నిస్తుంటే అధికార పార్టీ నేతలు తట్టుకోలేకపోతున్నారని చెప్పారు. రేవంత్ రెడ్డి పాలనలో తెలంగాణకు అన్యాయం జరుగుతోందన్నది తమ వాదనగా పేర్కొంటూ, సాగునీటి ప్రాజెక్టులు, రాష్ట్ర నీటి హక్కులపై ప్రభుత్వం స్పష్టమైన సమాధానం చెప్పాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు.



సంపాదకీయం

శనివారం 21-11-2026

రాశి కాదు... వాసి ముఖ్యం

భారతీయ ఉన్నత విద్యారంగం గత దశాబ్ద కాలంలో గణనీయంగా విస్తరించింది. విశ్వవిద్యాలయాలు, కళాశాలలు, విద్యార్థుల సంఖ్య పెరిగింది. ఈ విస్తరణకు అనుగుణంగా విద్యా నాణ్యత కూడా ఇనుమడించిందా? విద్యార్థులకు మేలిమి చదువులు, నైపుణ్యాలు, పరిశోధనా అవకాశాలు అందుతున్నాయా? స్వతంత్రంగా ఆలోచించే బాధ్యతాయుతమైన పౌరులుగా వారు ఎదుగుతున్నారా? ఇప్పుడు మనం సమాధానాలు తెలుసుకోవాల్సిన ప్రశ్నలివి.దేశీయంగా ఉన్నత విద్యను అభ్యసిస్తున్న వారి సంఖ్య 2014-15లో 3.42 కోట్లు ఉండేది. నేడు అది సుమారు 4.50 కోట్లకు చేరింది. విశ్వవిద్యాలయాలు 760 నుంచి దాదాపు పద్నాలుగు వందలకు, కళాశాలలు 38 వేల నుంచి 54 వేలకు పెరిగాయి. దాంతో లక్షలాది మంది యువతకు ఉన్నత విద్య అందుబాటులోకి వచ్చింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లో హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం వంటి నగరాలతో పాటు జిల్లా కేంద్రాలు, చిన్న పట్టణాల్లో ఇంజినీరింగ్, ఫార్మసీ, మేనేజ్‌మెంట్, వైద్య, వ్యవసాయ, డిగ్రీ కళాశాలలు పెద్ద సంఖ్యలో ఏర్పాటయ్యాయి. ఇది స్వాగతించదగ్గ పరిణామమే. అయితే, ఎన్ని సంస్థలు ఉన్నాయన్నది కాదు; అవి ఎంత నాణ్యమైన విద్యను అందిస్తున్నాయన్నదే ముఖ్యం.మేడిపండు చందం కారాదు!ఐటీ రంగం అభివృద్ధితో ఇంజినీరింగ్, ముఖ్యంగా కంప్యూటర్ సైన్స్ కోర్సులకు డిమాండ్ పెరిగింది. ఫార్మాస్యూటికల్ పరిశ్రమ విస్తరణతో ఫార్మసీ విద్య, ఉపాధి అవకాశాల ఆశతో బి.ఎడ్., మేనేజ్‌మెంట్, కంప్యూటర్ అప్లికేషన్స్ వంటి వృత్తివిద్యా కోర్సులూ విస్తరించాయి. వీటితోపాటు రాష్ట్ర, కేంద్ర, ప్రైవేట్, డీమ్డ్ విశ్వవిద్యాలయాల సంఖ్యా పెరిగింది. భవనాలు, కోర్సులు, విద్యార్థులు ఉన్నంత మాత్రాన ఒక నంత నిజమైన విశ్వవిద్యాలయం కాలేదు. నాణ్యమైన అధ్యాపకులు, ప్రమాణాలతో కూడిన పీజీ విద్య, ప్రయోగశాలలు, గ్రంథాలయాలు, పరిశోధన, భావప్రకటన స్వేచ్ఛ, ప్రశ్నించేతత్వం కలిగిన విద్యావాతావరణం అవసరం. విద్యా సంస్థలకు ఆర్థిక ప్రయోజనాలే ప్రధాన లక్ష్యమైతే విద్యావిలువలు దెబ్బతింటాయి. ప్రైవేట్ వర్సిటీలు లాభాపేక్షతో పనిచేయకూడదన్న సుప్రీంకోర్టు ఇటీవలి తీర్పు ఈ అంశంపై విస్తృత చర్చకు దారితీసింది. అదే సమయంలో సంస్థలకు తగిన ఆర్థిక వనరులు, ఉద్యోగులకు సముచిత వేతనాలు అవసరమనీ సుప్రీంకోర్టు గుర్తించింది. విద్యార్థులు ఏమి నేర్చుకుంటున్నారనే దానికంటే ఎంతమంది చేరుతున్నారు అన్నదానికే ప్రాధాన్యం పెరిగితే విద్యార్థి వినియోగదారుడిగా, ఉపాధ్యాయుడు సేవాప్రదాతగా, డిగ్రీ ఒక ఉత్పత్తిగా మారిపోయే ప్రమాదం ఉంది. విశ్వవిద్యాలయానికి అసలైన ఆస్తి భవనాలు కాదు; అక్కడి ఉపాధ్యాయుల మేధోసంపత్తి. కొన్ని ప్రైవేట్ సంస్థల్లో అధ్యాపకులపై బోధనేతర పనుల భారమూ అధికంగానే ఉంటోంది. దీనివల్ల పరిశోధనకు, కొత్త విషయాలు నేర్చుకోవడానికి సమయం దొరకడం లేదు. దానివల్ల విద్యార్థులకే నష్టం జరుగుతుంది. ఏఐ, ఆన్‌లైన్ కోర్సులు, డిజిటల్ గ్రంథాలయాలు వంటివి విద్యార్థులకు నేడు సమాచారాన్ని సులభంగా అందిస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో వర్సిటీలు కేవలం సమాచారాన్ని అందించే కేంద్రాలుగా మిగలకూడదు. విద్యార్థులకు ఆలోచించడం, విశ్లేషించడం, సమాచారాన్ని ధ్రువీకరించడం, స్వతంత్ర నిర్ణయాలు తీసుకోవడం నేర్పించాలి. వారిలో సాంకేతిక పరిజ్ఞానంతోపాటు నైతిక విలువలు, సామాజిక బాధ్యతను కూడా పెంపొందించాలి. వెనకబడిన ప్రాంతాల యువతకు మంచి ఉన్నత విద్య అందుబాటులో ఉండాలి. తెలంగాణలో హైదరాబాద్‌కు వెలుపల, ఆంధ్రప్రదేశ్‌లో అమరావతితోపాటు రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాల్లోనూ విద్యావకాశాలను విస్తరించాలి. దాంతోపాటు నాణ్యతకు తప్పనిసరిగా ప్రాధాన్యమివ్వాలి. అందుకోసం కొన్ని సంస్కరణలు అవసరం.

ఏం చేయాలంటే...

విద్యార్థులు సంపాదించిన జ్ఞానం, నైపుణ్యాలు, ఆలోచనా సామర్థ్యాన్ని నిరంతరం అంచనా వేయాలి. అధ్యాపకుల బోధన, పరిశోధనా సామర్థ్యాలకు ప్రాధాన్యమిస్తూ వారికి తగిన వేతనాలు, ఉద్యోగ భద్రత కల్పించాలి. పారిశ్రామిక, వ్యవసాయ, ఆరోగ్య, ప్రాంతీయ సమస్యలకు పరిష్కారాలు చూపగల పరిశోధనలను అన్ని వర్సిటీలు ప్రోత్సహించాలి. పీజీ విద్య, బోధన, పరిశోధన పరస్పరం అనుసంధానమై ఉండాలి. విద్యా బోధన, ప్రయోగశాలల వినియోగం, పరిశోధన, విద్యార్థుల ప్రగతిని ఎప్పటికప్పుడు బేరీజు వేయాలి. ప్రైవేట్ సంస్థలు ఫీజులు, ఆర్థిక లావాదేవీలు, అధ్యాపకుల వేతనాలు, మౌలిక సదుపాయాలు వంటి వివరాలను వెల్లడించాలి. జ్ఞాపకశక్తికి బదులుగా విశ్లేషణ, సమస్య పరిష్కారం, ప్రాజెక్టులు, చర్చలు, స్వతంత్ర ఆలోచనలకు ప్రాధాన్యమివ్వాలి. ఏఐ ద్వారా లభించే సమాచారాన్ని ధ్రువీకరించడం కూడా నేర్పించాలి. తరగతి గదిని పరిశ్రమతో అనుసంధానించాలి. అధ్యాపకులు, విద్యార్థులు, పూర్వ విద్యార్థులు, పరిశ్రమల ప్రతినిధుల భాగస్వామ్యంతో నాణ్యతను నిరంతరం సమీక్షించాలి. అంతిమంగా, ఉన్నత విద్యా సంస్కరణల లక్ష్యం మరిన్ని సంస్థలను నిర్మించడం కాదు; మెరుగైన విద్యను అందించడం కావాలి.

చైనా ఆధిపత్యంపై క్వాడ్ ఆందోళన



న్యూఢిల్లీ,రెండేళ్ల విరామం తరువాత ఈ వారం మొదటి రెండు రోజుల్లో మనీలాలో క్వాడ్ (క్వాడ్రిలేటరల్ సెక్యూరిటీ డైలాగ్) శిఖరాగ్ర సమావేశాలు వరుసగా జరగడంతో ఇండోపసిఫిక్ ప్రాంతం ప్రధాన చర్చనీయాంశంగా నిలిచింది. ఈ సమావేశాలన్నిటిలోనూ చైనా ఒక ప్రధాన అంశం కావడం విశేషం. క్వాడ్ దేశాల నాయకులు తమ సంయుక్త ప్రకటనలో ఆర్థిక ఒత్తిళ్లు, ముఖ్యంగా ఏకపక్షంగా విధించే ఎగుమతి ఆంక్షలపై ఆందోళన వ్యక్తం చేశారు. చైనా కీలకమైన ఖనిజాల సరఫరాపై తన ఆధిపత్యాన్ని ఉపయోగించుకుని వాటిని ఆయుధంగా ఉపయోగించుకుంటుందని క్వాడ్ సదస్సు ఆందోళన వ్యక్తం చేసింది. చైనా ఆర్థిక, వ్యూహాత్మక ఆధిపత్యం నేపథ్యంలో అమెరికా, జపాన్, ఆస్ట్రేలియా, భారత్ దేశాలతో కూడిన క్వాడ్ కూటమి ఇండో పసిఫిక్ ప్రాంతంలో భద్రతను కాపాడుకోవడానికి వాణిజ్య ప్రయోజనాలను రక్షించుకోవడానికి ఐక్యతను మరింత బలోపేతం చేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో సముద్ర ప్రాంతాల పర్యవేక్షణ, కృత్రిమ మేధస్సు, ఇంధన రంగం, సైబర్ భద్రత రంగాల్లో పరస్పర సహకారాన్ని మరింత పెంచుకోవాలని క్వాడ్ సదస్సు నిర్ణయించింది.ఇండో పసిఫిక్ ప్రాంతానికి సంబంధించి ఉమ్మడి దార్శనికతను రూపొందించి, దానిని పరస్పరం పంచుకోవాల్సిన అవసరాన్ని ఈ దేశాల నాయకులు గుర్తించారు. 2024 డిసెంబర్‌లో అమెరికా లోని డెలావేర్‌లో క్వాడ్ సదస్సు జరిగిన తరువాత మళ్లీ ఇప్పుడు క్వాడ్ సమావేశానికి పునరుజ్జీవం కల్పించారు. చైనా, రష్యాతో కలిసి ఎపెక్ (ఆసియా పసిఫిక్ ఆర్థిక సహకార సంస్థ) సదస్సులో పాల్గొనడానికి చైనా వెళ్తున్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్ క్వాడ్ సదస్సు విందుకు ముఖ్య అతిథిగా హాజరు కావడం విశేషం. మధ్యంతర ఎన్నికల తరువాత దేశీయ రాజకీయాల్లో ట్రంప్ కొన్ని పరిమితులను ఎదుర్కొంటున్నప్పటికీ, విదేశాంగ వ్యవహారాలను మాత్రం ఆయన స్వేచ్ఛగా నిర్వహించగలుగుతున్నారు. భద్రతా రంగంలో క్వాడ్ భవిష్యత్తు ఎలా ఉండబోతోందనే విషయంపై ఆయన ప్రస్తావించారు. అంతేకాదు ముఖ్యంగా ఇప్పుడు సూపర్ ఇంటెలిజెన్స్ క్వాడ్‌ను నడిపించబోతున్న నేపథ్యంలో అత్యాధునిక సూపర్ ఇంటెలిజెన్స్ పారిశ్రామిక విప్లవం కంటే గొప్ప మార్పును తీసుకు వస్తుందని, క్వాడ్ లోని సభ్యదేశాలన్నీ దీని ద్వారా ప్రయోజనం పొందుతాయని పేర్కొన్నారు. ఇండో పసిఫిక్ ప్రాంతంలో జలాంతర్గాములను గుర్తించడం, వాటి కార్యకలాపాలను ఎదుర్కోవడం వంటి జలాంతర్గామి వ్యతిరేక కార్యకలాపాలపై క్వాడ్ మరింత దృష్టి పెట్టాలని సూచించారు.ఇటీవలనే ఈ కూటమి నిర్వహించిన సంయుక్త సైనిక విన్యాసంలో ఇటువంటి కార్యకలాపాలను అనుకరించి సాధన చేసినట్టు ప్రస్తావించారు. అంతే కాకుండా వ్యర్థ పదార్థాలనుంచి కీలకమైన ఖనిజాలను తిరిగి వెలికి తీసేందుకు భారతదేశం, ఆసియాన్ దేశాల్లో అవసరమైన సదుపాయాలను నిర్మించడానికి అమెరికా 10 మిలియన్ డాలర్ల ఆర్థిక సహాయం అందించనున్నట్టు ప్రకటించింది. వచ్చే సంవత్సరం క్వాడ్ దేశాల వ్యాపార వేత్తలు, పారిశ్రామిక ప్రముఖులతో సమావేశం నిర్వహించనున్నట్టు ట్రంప్ ప్రకటించారు. ప్రపంచ వ్యాప్తంగా సముద్ర మార్గాలద్వారా సరకుల రవాణా సురక్షితంగా కొనసాగించాల్సిన అవసరాన్ని సదస్సు ప్రత్యేకంగా ప్రస్తావించింది. ప్రస్తుతం ఉద్రిక్తతలకు కేంద్రంగా మారిన హర్మూజ్ జలసంధి, ఎర్రసముద్రం, బాబ్ అల్ మందబ్ జలసంధి వంటి సముద్ర మార్గాల మీదుగా నౌకల రవాణా సురక్షితంగా జరగడం చాలా ముఖ్యమని పేర్కొంది. ఇరాన్‌తో జరుగుతున్న యుద్ధాన్ని ముగించగలిగితే ఈ సమస్యను పరిష్కరించడంలో అమెరికా ఎంతో చేయగలుగుతుందన్న అభిప్రాయం వ్యక్తమైంది. అయితే ట్రంప్ తన ప్రసంగంలో ఈ అంశాన్ని ప్రస్తావించలేదు. క్వాడ్ కూటమిని అమెరికా ప్రధానంగా చైనాతో ఉన్న వ్యూహాత్మక పోటీ కోణంలోనే చూస్తోంది.అయితే ఇండోనేసియా లోని జకార్తా కేంద్రంగా పనిచేసే ఆసియాన్ కూటమి మాత్రం అమెరికా, చైనా దేశాల్లో ఏదో ఒక దేశం వైపు వ్యూహాత్మకంగా మొగ్గు చూపాల్సిన పరిస్థితి రాకూడదని కోరుకుంటోంది. భారత్‌తో కలిసి విపత్తుల విషయంలో సహాయం అందించడం, ముందస్తు హెచ్చరిక వ్యవస్థలను ఏర్పాటు చేయడం వంటి అంశాలపై ఈ సదస్సులో ఒక ఒప్పందం కుదిరినప్పటికీ, చర్చల్లో ప్రస్తావనకు రాని మరో ముఖ్యమైన అంశం ఉంది. అది ఆసియాన్ లోని 11 ఆగ్నేయాసియా దేశాల కూటమికి, భారత్‌కు మధ్య సంబంధాలు మెరుగుపడుతున్నప్పటికీ వాణిజ్యం ఆశించిన స్థాయిలో వృద్ధి చెందడం లేదు. ఇక్కడ చైనా ప్రభావమే అడ్డంకిగా మారుతోంది.చైనాలో తయారైన వస్తువులను మరో మూడో దేశానికి తీసుకెళ్లి అక్కడ స్వల్పంగా మాత్రమే ప్రాసెస్ చేసి ఆ దేశంలో తయారైన వస్తువులుగా చూపించి భారత్ వంటి దేశాలద్వారా రాయితీలతో మార్కెట్ లోకి ప్రవేశించి అత్యధిక లాభాలు పొందుతాయన్న అనుమానాలు ఆసియాన్ దేశాల్లో ఉన్నాయి. ఇప్పుడు అందరి దృష్టి చైనా లోని షెన్‌జెన్‌లో జరగనున్న ఎపిఇసి సమావేశంలో చైనా, అమెరికా, రష్యా త్రైపాక్షిక చర్చలపైనే ఉంది. ఈ మూడు దేశాల మధ్య కొత్త జి3 కూటమి ఏర్పడే అవకాశం కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో భారత్ ఒకవైపు క్వాడ్ దేశాలతో తన సంబంధాలను బలోపేతం చేసుకుంటూనే, మరోవైపు ఆసియాన్ దేశాలతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం లోని ప్రతిష్టంభనను తొలగించి ఒప్పందాలను కుదుర్చుకోవాలి. అలాగే క్వాడ్ వాణిజ్య, పెట్టుబడి, సాంకేతికత, సముద్ర భద్రత సంబంధాలను మరింత పటిష్టం చేసుకోవాల్సిన అవసరం ఉంది.

బీజేపీ బిగ్ ఆపరేషన్.. ఆ మూడు కార్పొరేషన్లపై బీజేపీ గురి..?



హైదరాబాద్, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎన్నికలే లక్ష్యంగా బీజేపీ ఎన్నికల సమరానికి సన్నద్ధమవుతోంది. జీహెచ్ఎంసీని మూడు కార్పొరేషన్లుగా విభజించిన నేపథ్యంలో హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి కార్పొరేషన్లలోనూ మేయర్ పీఠాలను కైవసం చేసుకోవడమే లక్ష్యంగా పావులు కదుపుతోంది. ఇందుకోసం పార్టీ సంస్థాగత బలోపేతం, క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యలపై పోరాటాలు, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రచారంపై ప్రత్యేక దృష్టి సారించింది. హైదరాబాద్‌లోని బర్కత్‌పుర బీజేపీ సిటీ కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు అధ్యక్షతన గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని పార్టీ ముఖ్య నేతలతో కీలక సమావేశం జరిగింది.

300 మంది డివిజన్ అధ్యక్షులు..

పార్టీ ఎన్నికల ఇన్‌చార్జి ఆశిష్ షెలార్, రాష్ట్ర సహ ఇన్‌చార్జి అభయ్ పాటిల్, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ లక్ష్మణ్ పాల్గొన్నారు. గ్రేటర్ పరిధిలోని 9 జిల్లాల అధ్యక్షులు, జిల్లా ఇన్‌చార్జీలు, పదాధికారులతో పాటు 300 మంది డివిజన్ అధ్యక్షులు, సీనియర్ నేతలు ఈ సమావేశానికి హాజరయ్యారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహం, డివిజన్లవారీగా పార్టీ పరిస్థితి, ప్రజల్లోకి వెళ్లాల్సిన విధానం, ఎన్నికల కార్యాచరణపై నేతలు విస్తృతంగా చర్చించారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ స్థానిక సమస్యలపై నిరంతరం పోరాడాలని పార్టీ శ్రేణులకు రాష్ట్ర నాయకత్వం దిశానిర్దేశం చేసింది.

పట్టు కోల్పోయే ప్రమాదం..

ఈ సందర్భంగా రాంచందర్ రావు మాట్లాడుతూ.. పార్టీ నేతలు, కార్యకర్తలు ఇప్పటి నుంచే కష్టపడి పనిచేయాలని, లేకపోతే భవిష్యత్తులో హైదరాబాద్‌పై బీజేపీ పట్టు కోల్పోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. హైదరాబాద్ మేయర్ పీఠంతో పాటు తెలంగాణలోనూ బీజేపీ అధికారంలోకి రావాలనే సంకల్పంతో ముందుకు సాగుతున్నామని స్పష్టం చేశారు. గతంలో బీఆర్ఎస్ డబ్బు, ప్రలోభాలు, మాయమాటలతో బీజేపీ గెలవాల్సిన స్థానాలను దక్కించుకుందని ఆరోపించారు. ఈసారి అలాంటి పరిస్థితులకు తావులేకుండా పార్టీ శ్రేణులంతా సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

వాటా విషయంలో..

గత బీఆర్ఎస్ ప్రభుత్వం 20 శాతం కమిషన్లకు పాల్పడితే, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం 30 నుంచి 40 శాతం కమిషన్ల ప్రభుత్వంగా మారిందని విమర్శించారు. ప్రజలను మోసం చేయడంలో రెండు పార్టీలదీ ఒకే విధానమని ఆరోపించారు. నీళ్లు, నిధులు, నియామకాల నినాదంతో సాధించుకున్న తెలంగాణలో గత బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాలు ప్రజలకు అన్యాయం చేశాయని మండిపడ్డారు. కృష్ణా జలాల్లో తెలంగాణకు రావాల్సిన వాటా విషయంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం రాజీపడిందని ఆరోపించారు. నగరంలో నెలకొన్న తాగునీటి సమస్య, అధ్వానంగా మారిన రహదారులు, మౌలిక సదుపాయాల కొరత వంటి అంశాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని పార్టీ నేతలకు సూచించారు.

ఓటరు నమోదు..

కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను స్థానిక ప్రజలతో కలిసి ఎండగట్టాలని, ప్రతి డివిజన్‌లో ప్రజా సమస్యలపై ఉద్యమాలు నిర్వహించాలని దిశానిర్దేశం చేశారు. అదే సమయంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ఇంటింటికీ తీసుకెళ్లాలని సూచించారు. ఎన్నికల విజయానికి ఓటరు నమోదు కీలకమని పేర్కొంటూ, అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదయ్యేలా పార్టీ శ్రేణులు బాధ్యత తీసుకోవాలని రాంచందర్ రావు సూచించారు. విస్తృత స్థాయిలో ప్రజా ఉద్యమాలు, పోరాటాలు, సేవా కార్యక్రమాలతో ప్రజలకు చేరువ కావాలని పిలుపునిచ్చారు. రానున్న మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్, వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ బీజేపీ అభ్యర్థుల విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ ఎన్నికలను కూడా పార్టీ శ్రేణులు ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలని సూచించారు.

మియాపూర్‌లోని 550 ఎకరాల వేలం నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నాం

మియాపూర్‌లోని సర్వే నంబర్ 100, 101 పరిధిలో గల 550 ఎకరాల ప్రభుత్వ భూమిని వేలం వేయాలన్న కాంగ్రెస్ ప్రభుత్వ నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు రాంచందర్ రావు గారు స్పష్టం చేశారు. బుధవారం మియాపూర్‌లోని ఎంఏ నగర్, ప్రశాంత్ నగర్, స్టాలిన్ నగర్, దీప్తిశ్రీ నగర్ కాలనీలలో ఆయన పర్యటించి, తమ నివాసాలను కోల్పోతామన్న భయాందోళనలో ఉన్న స్థానిక ప్రజలతో మాట్లాడి వారికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. అనేక ఏళ్లుగా న్యాయపరమైన చిక్కుల్లో ఉన్న ఈ 550 ఎకరాల భూమిపై ఇటీవల సుప్రీంకోర్టు తెలంగాణ ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు ఇచ్చిన నేపథ్యంలో, కాంగ్రెస్ ప్రభుత్వం ఈ భూములను వేలం వేసి అమ్ముకోవాలని చూడటం దారుణమని అన్నారు.

30 ఏళ్లకు పైగా..

ఈ 550 ఎకరాలలో దాదాపు 150 ఎకరాల భూమిలో 1983 నుండే అధికారిక రిజిస్ట్రేషన్లు, హెచ్ఎండీఏ అప్రూవ్డ్ లేఅవుట్లు, బ్యాంకు లోన్ల ద్వారా మధ్యతరగతి ప్రజలు నిర్మించుకున్న ఇళ్లు ఉన్నాయని ఆయన తెలిపారు. అలాగే జీవో నంబర్ 58, 59, 60 కింద పేదలు క్రమబద్ధీకరించుకున్న 68 గజాల స్థలాలు, బస్తీల్లో దాదాపు 10 నుంచి 15 వేల కుటుంబాలు దశాబ్దాలుగా నివసిస్తున్నాయని పేర్కొన్నారు. 30 ఏళ్లకు పైగా వారి స్వాధీనంలో ఉన్న ఈ 150 ఎకరాల భూమి, ఇళ్లు కచ్చితంగా ఆయా కుటుంబాలకే చెందాలని, ప్రభుత్వం వాటి జోలికి వెళ్లకూడదని ఆయన డిమాండ్ చేశారు.

లక్ష సంతకాలతో..

ఖాళీగా ఉన్న మిగిలిన 400 ఎకరాల భూమిని 2,500 నుంచి 5,000 గజాల ప్లాట్లుగా విభజించి బహిరంగ వేలంలో అమ్మాలని ప్రభుత్వం ప్రయత్నిస్తోందని రాంచందర్ రావు మండిపడ్డారు. ప్రభుత్వ భూముల వేలాన్ని నిరసిస్తూ శేరిలింగంపల్లి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి 'లక్ష సంతకాల సేకరణ' కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నామని, స్వయంగా తానే మొదటి సంతకం చేసి ఈ ఉద్యమానికి శ్రీకారం చుడుతున్నట్లు రాంచందర్ రావు తెలిపారు. సేకరించిన లక్ష సంతకాలతో కూడిన వినతిపత్రాన్ని ప్రభుత్వానికి అందజేస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకుడు రవి కుమార్ యాదవ్, మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

చంద్రగిరి, రంగంపేట గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వం చిత్రలేఖనం పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు పోలీస్ శిక్షణ కళాశాల ప్రిన్సిపాల్ ఎం. మహేష్ కుమార్ బహుమతులను ప్రదానం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు చిన్న వయస్సు నుంచే క్రమశిక్షణ, పట్టుదల, సమయపాలన అలవాటు చేసుకొని చదువుపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. జీవితంలో ఉన్నత స్థానాలను చేరుకోవాలంటే నిరంతర కృషి, కష్టపడి చదవడం, ఆత్మవిశ్వాసం ఎంతో అవసరమని తెలిపారు.

కోదాడ అయ్యప్ప స్వామి ఆలయంలో అన్నదాన కార్యక్రమం

కోదాడ: పట్టణంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో కార్తీక మాసం, అయ్యప్ప మాలధారణ సందర్భంగా భక్తిభావంతో అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తారు. ఈ సందర్భంగా ఆలయానికి పెద్ద సంఖ్యలో అయ్యప్ప స్వాములు, భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని కోరిన కోరికలు తీర్చమని వేడుకుంటారు. ప్రతిరోజు స్వామివారికి ప్రత్యేక అభిషేకములు, అలంకరణ నిర్వహిస్తారు. కోదాడ అయ్యప్ప స్వామి దేవాలయంలో ప్రతి బుధవారం స్వామివారికి పల్లకి సేవ నిర్వహించడం జరుగుతుంది, అయ్యప్ప నామస్మరణలు, భజనలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలతో ఆలయ ప్రాంగణం భక్తిమయ వాతావరణాన్ని సంతరించుకుంది. అయ్యప్ప స్వాములు, మాలధారులు, మహిళలు, చిన్నారులు, వృద్ధులు సహా ఆలయానికి విచ్చేసిన భక్తులందరికీ ప్రేమాభిమానాలతో అన్నప్రసాదాన్ని అందజేశారు. భక్తులు క్రమశిక్షణతో అన్నప్రసాదాన్ని స్వీకరించి నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు.కార్తీక మాసంలో అయ్యప్ప మాలధారణకు ఎంతో విశిష్టత ఉందని, ఈ పవిత్ర సమయంలో భక్తితో స్వామివారిని ఆరాధించడంతో పాటు సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం ఎంతో పుణ్యప్రదమని భక్తులు పేర్కొన్నారు. అన్నదానం అన్ని దానాల్లోకెల్లా గొప్పదని, కార్తీక మాసంలో చేసే ప్రతి దానం రెట్టింపు ఫలితం అందిస్తుందని అంటారు.ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టడం ద్వారా మానవత్వం, సేవాభావం చాటుకోవచ్చని అన్నారు.ఆధ్యాత్మికతతో పాటు సేవా భావాన్ని పెంపొందించే ఇలాంటి అన్నదాన కార్యక్రమాలు సమాజంలో ఐక్యత, సోదరభావం, భక్తిభావాన్ని మరింత పెంపొందిస్తాయని పలువురు అభిప్రాయపడ్డారు. అయ్యప్ప స్వామి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, ప్రతి ఒక్కరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ప్రార్థించారు. ఈరోజు స్వామివారికి నైవేద్యం సమర్పించిన వారు వేజెండ్ల శివనాగు భవాని దంపతులు. ఈరోజు అన్నదాతలు నారాయణపురం వాస్తవ్యులు బూర వెంకటనారాయణ, లక్ష్మీనారాయణ, నరసింహారావు కుటుంబ సభ్యులు.ఈ అన్నదాన కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, అయ్యప్ప స్వాములు, మాలధారులు, భక్తులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

పెద్దోళ్ల ను తిడితే గొప్పోల్లవుతారని అనుకుంటే సాధ్యం కాదు

యాదాద్రి భువనగిరి,బంగారు తెలంగాణ కు బాటలు వేసిన కార్యసాధకులు కేటీఆర్, హరీశ్ రావు ల పై నోరు పారేసుకుంటే ఊరుకోం అని ఆలేరు మాజీ ఎం ఎల్ ఏ గొంగిడి సునీత హెచ్చరించారు.బుదవారం భువనగిరి బిఆర్ ఎస్ పార్టీ కార్యాలయం లో ఏర్పాటు చేసిన మెఘియా సమావేశం లో మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టు మూసివేసి నీళ్లు విడుదల చేయకుండా వ్యవసాయానికి ఎంబెట్టిన మీరు కేసీఆర్ పై మాట్లాడటం సిగ్గు చేతన్నారు.పెద్దోళ్ల ను తిడితే గొప్పోల్లవుతారని అనుకుంటే సాధ్యం కాదన్నారు.కేటీఆర్ ను డ్రామా రావు అంటావా.. ఎంత ధైర్యం. అబద్దాల కేటీఆర్ అంటే నిన్ను భూదందా ల అయిలయ్య అంటాం.ఆలేరు కు వెళ్ళు చూడు.. అండర్ పాస్ ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు.యాదగిరిగుట్ట అండర్ పాస్ బ్రిడ్జి ఎందుకు తొలగించలేదు.100 రోజుల్లో ఆలేరు రెవెన్యూ డివిజన్ చేస్తానని హమీ ఎక్కడ పోయిందని ప్రశ్నించారు.3 ఏళ్ల కాలంలో ఆలేరు కు చేసిన అభివృద్ధి పై శ్వేత పత్రం విడుదల చేయాలని సునీత డిమాండ్ చేశారు.అవగాహన లేక నోటికి వచ్చిన మాట్లాడితే ప్రజలు చూస్తూ ఊరుకోరు.నిర్మల్ లో రైతు దీక్ష పెడితే ప్రభుత్వానికి వెన్ను లో వణుకు.ఏ గ్రామంలో రైతుకు రుణమాఫీ జరిగిందో వచ్చి చూపించాలని సవాల్ విసిరారు.రైతులను నట్టేట మంచి, రైతులు సంతోషంగా ఉన్నారు అంటే ఎట్లా ఆలేరులో సాగు జలాల పరిస్థితి ఏంటి.చెరువులు ఎండిపోతున్నాయి. తలాపున గోదావరి ఉంటే ఎందుకు నీళు ఎత్తిపోసి ఆలేరు కు సాగు జలాల ఎందుకు తీసుకురాలేద అని ప్రశ్నించారు.. కేటీఆర్ హరీష్ రావు పై విమర్శలు మానీ ఆలేరు అభివృద్ధిపై దృష్టి పెట్టు అని హితవు పలికారు రూ. 73 వేల కోట్ల రైతు బంధు, 24 వేల కోట్ల రైతు భీమా కు బీ ఆర్ ఎస్ పార్టీ ఖర్చు చేసింది.లక్ష అరవై వేల కోట్ల నిధులు ఖర్చు చేసి రైతులకు సాగు జలాలు అందించింది ప్రభుత్వం బీ ఆర్ ఎస్.వ్యవసాయానికి 5 లక్షల కోట్ల ఖర్చు చేసి దేశానికే అన్నపూర్ణగా మార్చి ఈ రాష్ట్రాని అభివృద్ధి బాటలో నడిపిన ఘనత కేసీఆర్ డే నన్నారు.కేంద్రం వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెడుతామంటే అడ్డుకున్న నాయకుడు కేసీఆర్.మీరు వాడే ప్రతి సాగు జలాలు కాళేశ్వరం లో భాగమే.కేసీఆర్ సింహం లాంటి వ్యక్తిని గెలికితే మీ ఖర్మ.. మిమ్ములి ఎవ్వరు కాపాడలేరు.కేసీఆర్ ఈ రాష్ట్రానికి జాతిపిత.ఎల్ నినో వస్తే అప్రమత్తమై చేపట్టాల్సిన ముందస్తు చర్యలు ఎందుకు చేపట్టలేదని ప్రశ్నించారు.ప్రపంచమంతా ఎల్ నినో సమస్య ఉంది. కేవలం తెలంగాణ లోనే రాలేదు.పేద, మధ్య తరగతి కుటుంబాలు బియ్యం కొనుగోలు చేసే పరిస్థితి లేదు.గతంలో రూ. 25 నుంచి 30 ఉంటే ఇప్పుడు కిలో బియ్యానికి రూ. 100 పెరిగింది.మహిళలకు మీరు ఎం చేశారు. హన్మకొండలో మహిళలకు వడ్డీ లేని రుణాలు కింద రూ. 13 వేల కోట్ల చెక్కు బౌన్స్ అయిన ఘటన మహిళలు మరిచిపోలేదన్న

అనితా చౌదరికి సైబర్ షాక్

హైదరాబాద్ ,విమాన టికెట్లు బుక్ చేస్తామంటూ ఓ నకిలీ ట్రావెల్ ఏజెన్సీ పేరుతో సైబర్ నేరగాళ్లు టాలీవుడ్ నటి అనితా చౌదరిని మోసం చేశారు. ఆమె బ్యాంకు ఖాతా నుంచి ఏకంగా రూ. 4.14 లక్షలు కాజేశారు. అమెరికాలోని వాషింగ్టన్ డీసీలో ఉంటున్న తన కుమారుడి పుట్టినరోజు వేడుకలకు హాజరయ్యేందుకు బిజినెస్ క్లాస్ రిటర్న్ టికెట్లు బుక్ చేసుకోవాలనుకున్న ఆమె.. ఆన్‌లైన్‌లో ట్రావెల్ ఏజెన్సీ కోసం వెతికి సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకున్నారు. ఈ ఘటనపై బాధితురాలి ఫిర్యాదుతో సైబర్ క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.సినిమాలో క్యారెక్టర్ రోల్స్ చేసే అనితా చౌదరి హైదరాబాద్‌లోని మాదాపూర్ కావూరి హిల్స్‌లో నివసిస్తున్నారు. ఈ నెల 12న విమాన టికెట్ల బుకింగ్ కోసం ఆన్‌లైన్‌లో వెతుకుతుండగా లో ఫ్లై ట్రావెల్స్ టూర్స్ అండ్ ట్రావెల్స్ అనే సంస్థ వివరాలు ఆమెకు కనిపించాయి. వెబ్‌సైట్‌లో ఇచ్చిన ఫోన్ నంబర్‌కు సంప్రదించగా.. రాజేశ్ అనే వ్యక్తి మాట్లాడాడు. వాషింగ్టన్ డీసీకి వెళ్లి తిరిగి వచ్చేందుకు బిజినెస్ క్లాస్ టికెట్ల ధర రూ. 4,14,180 అవుతుందని చెప్పాడు. బుకింగ్ పూర్తి చేయడానికి డెబిట్ కార్డు వివరాలు అవసరమని నమ్మించాడు.అనంతరం ఆమెకు ఓ ఫారం పంపించి అందులో డెబిట్ కార్డు వివరాలు నమోదు చేయాలని సూచించాడు. ఫోన్‌లో మాట్లాడుతూ ఆమెను సంభాషణలో ఉంచిన నిందితుడు.. మొబైల్‌కు వచ్చిన వన్‌టైమ్ పాస్‌వర్డ్‌లను కూడా చెప్పాలని కోరాడు. టికెట్ల బుకింగ్ ప్రక్రియలో భాగంగానే ఓటీపీలు అడుగుతున్నారని భావించిన అనితా చౌదరి వాటిని అతడికి వెల్లడించారు. దీంతో నిందితులు ఆమె ఖాతా నుంచి నగదును కాజేశారు.కొద్దిసేపటికే క్లియర్‌ట్రిప్ ద్వారా తన ఖాతా నుంచి రూ. 4,14,180 డెబిట్ అయినట్లు అనితకు సందేశం వచ్చింది. అయితే విమాన టికెట్ల బుకింగ్ పూర్తయినట్లు ఎలాంటి ధ్రువీకరణ అందకపోవడంతో మోసపోయినట్లు గుర్తించారు. వెంటనే బ్యాంకు కస్టమర్ కేర్‌ను సంప్రదించి ఫిర్యాదు చేశారు. అనంతరం సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించారు. బాధితురాలి ఫిర్యాదు ఆధారంగా రాజేశ్‌పై కేసు నమోదు చేసిన పోలీసులు.. నకిలీ ట్రావెల్ ఏజెన్సీ వెనుక ఉన్న వ్యక్తుల వివరాలు, నగదు ఎక్కడికి బదిలీ అయిందనే అంశాలపై దర్యాప్తు చేస్తున్నారు.ఆన్‌లైన్‌లో విమాన టికెట్లు బుక్ చేసుకునేటప్పుడు వెబ్‌సైట్ నిజమైనదో కాదో నిర్ధారించుకోవడం అత్యంత కీలకమని పోలీసులు చెబుతున్నారు. ముఖ్యంగా ఫోన్‌లో మాట్లాడే వ్యక్తులకు డెబిట్ లేదా క్రెడిట్ కార్డు వివరాలు, ఓటీపీలు వెల్లడించకూడదని అంటున్నారు. టికెట్ బుకింగ్ పేరుతో ఓటీపీ అడిగే వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు.

పల్లె దొడ్డి గ్రామంలో ప్రజల పక్షాన ఏకగ్రీవం ఎన్నిక

దేవనకొండ , దేవనకొండ మండల పరిధిలోని పల్లెదొడ్డి గ్రామంలో సర్పంచ్ ఎన్నికల నేపథ్యంలో గ్రామ ప్రజలు ఐక్యంగా కీలక నిర్ణయం తీసుకున్నారు. గ్రామ అభివృద్ధితో పాటు గ్రామంలోని దేవాలయాల అభివృద్ధిని ప్రధాన లక్ష్యంగా పెట్టుకుని, గ్రామ పెద్దలు, ప్రజల సమక్షంలో నిర్వహించిన సమావేశంలో బోయ పాపినేని కౌలుట్లమ్మను సర్పంచ్ అభ్యర్థిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గతంలో మాదిరిగానే గ్రామ ప్రజలందరూ ఒకే తాటిపైకి వచ్చి, ఎన్నికల్లో పోటీలు, విభేదాలకు తావులేకుండా గ్రామ ఐక్యతను చాటాలని నిర్ణయించుకున్నారు. గ్రామానికి వచ్చే ప్రభుత్వ నిధులను సద్వినియోగం చేసుకుంటూ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడంతో పాటు, గ్రామంలోని మారెమ్మ దేవాలయంతో సహా ఇతర దేవాలయాల అభివృద్ధికి కృషి చేయాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు.ఈ మేరకు బోయ పాపినేని కాశీమన్న భార్య అయిన బోయ పాపినేని కౌలుట్లమ్మను పల్లెదొడ్డి గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా గ్రామ ప్రజలందరూ ఏకగ్రీవంగా ప్రకటించారు. అనంతరం గ్రామ పెద్దలు, ప్రజలు, బోయ పాపినేని కాశీమన్న సమక్షంలో సర్పంచ్ అభ్యర్థి కౌలుట్లమ్మతో పాటు పది వార్డుల సభ్యుల అభ్యర్థులు కలిసి నామినేషన్లు దాఖలు చేశారు.ఈ సందర్భంగా గ్రామ ప్రజలు మాట్లాడుతూ గ్రామ అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ ఐక్యంగా ముందుకు రావాలని, గ్రామానికి వచ్చే నిధులతో మౌలిక సదుపాయాలు మెరుగుపరచడంతో పాటు దేవాలయాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. గ్రామంలో ఏ సమస్య తలెత్తినా సర్పంచ్, వార్డు సభ్యులు ముందుండి పరిష్కరించాలని, ప్రజలకు అందుబాటులో ఉంటూ గ్రామ ప్రగతికి కృషి చేయాలని తీర్మానించారు.పల్లెదొడ్డి గ్రామ ప్రజలందరూ ఐకమత్యంతో తీసుకున్న ఈ నిర్ణయం గ్రామ ఐక్యతకు నిదర్శనంగా నిలిచింది. గ్రామ అభివృద్ధి కోసం రాజకీయాలకు అతీతంగా అందరూ కలిసి పనిచేయాలని ఈ సందర్భంగా గ్రామ పెద్దలు, ప్రజలు ఆకాంక్షించారు.

కర్ణాటక నుంచి భారీ ఎత్తున విద్యుత్ ఉద్యోగులు

విజయవాడ, ఆంధ్రప్రదేశ్‌ను అతలాకుతలం చేసిన 'అర్నబ్', 'మురసు' జంట తుపాన్ల విధ్వంసం నుంచి కోలుకునే క్రమంలో విద్యుత్ వ్యవస్థ పునరుద్ధరణకు సకాలంలో అండగా నిలిచిన కర్ణాటక ప్రభుత్వానికి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు కర్ణాటక ముఖ్యమంత్రి డి.కె. శివకుమార్‌కు బుధవారం ఆయన అధికారిక లేఖ రాశారు. విపత్తు వేళ పొరుగు రాష్ట్రం చూపిన చొరవ, తక్షణ స్పందనను ఆయన లేఖలో ప్రత్యేకంగా ప్రశంసించారు.జంట తుపాన్ల తీవ్రతకు ఏపీలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ మౌలిక సదుపాయాలు తీవ్రంగా దెబ్బతిని సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. సంక్షోభ సమయంలో కర్ణాటక ప్రభుత్వం వెంటనే స్పందించి 68 బృందాలుగా 592 మంది విద్యుత్ సిబ్బందిని ఆంధ్రప్రదేశ్‌కు పంపించింది. స్థానిక సిబ్బందితో కలిసి ప్రతికూల పరిస్థితుల్లో పనిచేసిన కర్ణాటక బృందాలు విద్యుత్ సరఫరాను వేగంగా పునరుద్ధరించడంలో కీలక పాత్ర పోషించాయని చంద్రబాబు కొనియాడారు.ఏపీ సీపీడీసీఎల్ పరిధిలోనే తుపాన్ల విధ్వంసం తీవ్రస్థాయిలో కనిపించింది. 'అర్నబ్' తుపాను కారణంగా 1,333 గ్రామాలు, 'మురసు' దాటికి 1,825 గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. అలాగే అర్నబ్ ప్రభావంతో 1,852 స్తంభాలు, మురసు ప్రభావంతో ఏకంగా 7,850 స్తంభాలు విరిగిపడటంతో విద్యుత్ వ్యవస్థకు పెను నష్టం వాటిల్లింది. ఏపీ సీపీడీసీఎల్ పరిధిలో అర్నబ్ తర్వాత 165 బృందాల్లో 1,580 మంది, మురసు తర్వాత 390 బృందాల్లో 3,292 మంది స్థానిక సిబ్బంది రంగంలోకి దిగగా, కర్ణాటక నుంచి వచ్చిన బృందాలు వారికి అదనపు బలాన్ని చేకూర్చాయని సీఎం వివరించారు.ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు అందించుకునే ఇలాంటి పరస్పర సహకారం ఇరు రాష్ట్రాల మైత్రిని మరింత పటిష్ఠం చేస్తుందని తెలిపారు. భవిష్యత్తులో కర్ణాటకకు ఎటువంటి విపత్తులు లేదా అత్యవసర పరిస్థితులు ఎదురైనా సిబ్బంది, యంత్ర పరికరాలు, అవసరమైన అన్ని రకాల సహాయాన్ని అందించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కట్టుబడి ఉందని లేఖలో హామీ ఇచ్చారు.

కాగితాలపైనే పేదరికం తగ్గింది!



హైదరాబాద్,పేదరిక అంచనా ప్రభుత్వానికి విజయపత్రం కాదు. అది ఒక కొలమానం మాత్రమే. దాని వెనుక ఉన్న పద్ధతులు, ప్రమాణాలు, పరిమితులను కూడా పరిశీలించాలి. పేదరికం తగ్గిందని చెబుతున్న సమయంలో 80 కోట్ల మందికిపైగా ప్రజలు ఉచితంగా లేదా సబ్సిడీతో అందించే ఆహార ధాన్యాలపై ఆధారపడుతున్నారంటే అందులోని వైరుధ్యాన్ని ప్రభుత్వం వివరించాలి. ఉచిత రేషన్ ఆకలినుంచి కాపాడే జీవనాధారం మాత్రమే కానీ సంపన్నతకు కొలమానం కాదు. బియ్యం సంచి ఇంటి అద్దె చెల్లించదు. పిల్లల ఫీజులు, మందులు, విద్యుత్ బిల్లులు కట్టదు. ప్రభుత్వ సహాయంతో బతకడం, ఆర్థికంగా స్వతంత్రంగా జీవించడం రెండూ ఒకటి కావు. పేదరిక రేఖను నిర్ణయించే ప్రమాణాలపైనా ప్రశ్నలు ఉన్నాయి.ప్రభుత్వాలకు తమ విజయాలను చాటిచెప్పే గణాంకాలంటే ఎప్పుడూ మక్కువే. తాజాగా దేశంలో పేదరికం తగ్గిందంటూ వెలువడిన గణాంకాలు పాలకులకు మరో ప్రచార అస్త్రంగా మారాయి. 2023- 24 నాటికి భారత్‌లో తీవ్ర పేదరికం 2.6 శాతానికి తగ్గిందన్న ప్రపంచ బ్యాంకు అంచనాలను ప్రభుత్వం ఆర్థిక విజయానికి నిదర్శనంగా చూపుతోంది. అయితే భారతీయులు నిజంగానే పేదరికంనుంచి బయటపడ్డారా? లేక పేదరికాన్ని గణాంకాల్లో అందంగా అలంకరించి చూపిస్తున్నారా? అన్నది పరిశీలించాల్సిన ప్రశ్న. పేదరిక అంచనా ప్రభుత్వానికి విజయపత్రం కాదు. అది ఒక కొలమానం మాత్రమే. దాని వెనుక ఉన్న పద్ధతులు, ప్రమాణాలు, పరిమితులను కూడా పరిశీలించాలి. పేదరికం తగ్గిందని చెబుతున్న సమయంలో 80 కోట్ల మందికిపైగా ప్రజలు ఉచితంగా లేదా సబ్సిడీతో అందించే ఆహార ధాన్యాలపై ఆధారపడుతున్నారంటే అందులోని వైరుధ్యాన్ని ప్రభుత్వం వివరించాలి. ఉచిత రేషన్ ఆకలినుంచి కాపాడే జీవనాధారం మాత్రమే కానీ సంపన్నతకు కొలమానం కాదు. బియ్యం సంచి ఇంటి అద్దె చెల్లించదు. పిల్లల ఫీజులు, మందులు, విద్యుత్ బిల్లులు కట్టదు.

ఆహారంపంచిపెట్టండి

ప్రభుత్వ సహాయంతో బతకడం, ఆర్థికంగా స్వతంత్రంగా జీవించడం రెండూ ఒకటి కావు. పేదరిక రేఖను నిర్ణయించే ప్రమాణాలపైనా ప్రశ్నలు ఉన్నాయి. ధరల మార్పులు, వినియోగ వ్యయాల లెక్కింపు, సర్వే విధానాలు పేదరిక అంచనాలను ప్రభావితం చేస్తాయి. అధికారిక గణాంకాలు వాస్తవ ఆర్థిక సంక్షోభాన్ని పూర్తిగా ప్రతిబింబించడం లేదని పరిశోధకులు అభిప్రాయపడుతున్నారు. ప్రజలు రెండు పూటల సంపూర్ణ భోజనం భరించగలుగుతున్నారా? తగిన పోషకాహారం అందుతోందా? అన్న ప్రశ్నలకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలి. జిడిపి వృద్ధి, మౌలిక సదుపాయాలు, డిజిటల్ విజయాలతోనే దేశ ఆర్థిక ప్రగతిని కొలవలేం. రోజువారీ కూలీకోసం ఎదురుచూసే కార్మికుడు, పెట్టుబడి ఖర్చులతో సతమతమవుతున్న రైతు, ఉద్యోగంకోసం నిరీక్షిస్తున్న నిరుద్యోగ పట్టభద్రుడు, వైద్య ఖర్చులు భరించలేక చికిత్సను వాయిదా వేసుకునే కుటుంబం కూడా దేశ ఆర్థిక వ్యవస్థలో భాగమే. ఉద్యోగం ఉన్నంత మాత్రాన ఆర్థిక భద్రత ఉన్నట్లు కాదు. గిగ్ కార్మికులు, రోజువారీ కూలీలు, స్థిర ఆదాయం లేని స్వయం ఉపాధిదారులు కూడా ఉద్యోగులుగా లెక్కించబడవచ్చు. కానీ వారి జీవన పరిస్థితులు స్థిరమైన వేతనం పొందే ఉద్యోగులతో సమానమా?

చరిత్ర పుస్తకాలు చదవండి

రోడ్డుపై కూరగాయలు అమ్మడం, అద్దె వాహనం నడపడం, అప్పుడప్పుడు నిర్మాణ పనులు చేయడం వంటి జీవన పోరాటాలను స్వయం ఉపాధి విజయాలుగా చిత్రీకరించడం వాస్తవాలను విస్మరించడమే. నిరుద్యోగానికి కొత్త పేరు పెట్టినంత మాత్రాన ఉపాధి సంక్షోభం పరిష్కారం కాదు. నిరుద్యోగ యువతను ఆదుకోవడం, వృద్ధుల సంరక్షణ, పిల్లల చదువులు, వైద్య ఖర్చులు.. అన్నీ కుటుంబాల బాధ్యతగా మారుతున్నాయి. కుటుంబాల సహనాన్ని ప్రశంసించే పాలకులు, తక్కువ వేతనాలు, ఖరీదైన విద్య, ప్రభుత్వ వైద్య సేవల లోపాల భారాన్ని కుటుంబాలు ఎంతకాలం మోయాలన్న ప్రశ్నకు సమాధానం చెప్పాలి. కుటుంబం అండగా ఉండాలి కానీ ప్రభుత్వ బాధ్యతలకు ప్రత్యామ్నాయంగా మారకూడదు. సంక్షేమ పథకాలను ప్రభుత్వ బాధ్యతగా కాకుండా అధికార పార్టీ దాతృత్వంగా ప్రచారం చేయడం మరో సమస్య. ఉచిత బియ్యం ఎన్నికల ప్రచార ఘనతగా మారుతోంది. అయితే కుటుంబాలు ఇంత విస్తృతంగా ప్రభుత్వ సహాయంపై ఎందుకు ఆధారపడుతున్నాయి? స్థిరమైన ఉపాధి, సరిపడా వేతనాలు ఎందుకు లభించడం లేదు? అన్న ప్రశ్నలకు సమాధానం చెప్పాలి. సంక్షేమ పథకాల్లో తప్పు లేదు.ప్రజల ఆర్థిక దుర్బలత్వాన్ని తగ్గించాల్సిన బాధ్యత నుంచి తప్పించుకునేందుకు వాటిని రాజకీయ కవచంగా ఉపయోగించడంలోనే తప్పు ఉంది. ఆహార ధరల పెరుగుదల పేదల జీవితాలను మరింత కష్టాల్లోకి నెడుతోంది. ధరలు పెరిగితే సంపన్నులు ఖర్చులు తగ్గించుకుంటారు. పేదలు తమ భోజనాన్ని తగ్గించుకుంటారు. ప్రోటీన్ ఆహారాన్ని మానుకుంటారు. బలహీన వర్గాలు అప్పులపాలవుతాయి. ఈ వాస్తవాలను ప్రభుత్వ ప్రకటనలు కప్పిపుచ్చలేవు. దేశానికి సౌకర్యవంతమైన పేదరిక అంచనాలు కాదు, వాస్తవాలను ప్రతిబింబించే సమగ్ర కొలమానాలు అవసరం. కుటుంబాలకు స్థిరమైన ఆదాయం ఉందా? కార్మికులకు జీవనానికి సరిపడే వేతనాలు లభిస్తున్నాయా? వైద్య అత్యవసర పరిస్థితుల్లో అప్పులు చేయకుండా బయటపడగలుగుతున్నారా? పిల్లలకు పోషకాహారం అందుతోందా? యువతకు గౌరవప్రదమైన ఉపాధి లభిస్తోందా? ఇవే ఆర్థిక భద్రతను కొలిచే అసలైన ప్రమాణాలు.

జనాభా లెక్కలు చూడండి

ప్రపంచ బ్యాంకు అంచనాలు పురోగతిని సూచిస్తే దాన్ని తిరస్కరించాల్సిన అవసరం లేదు. కానీ గణాంకాల్లో పురోగతి సాధించినంత మాత్రాన పాలకుల బాధ్యత తీరిపోదు. పేదరికం తగ్గిందని ప్రకటించే ప్రభుత్వం ప్రజల నుంచి చప్పట్లు కోరుకోవడం కంటే, వారు మళ్లీ పేదరికంలోకి జారిపోకుండా ఆర్థిక భద్రత కల్పించాలి. రాజకీయ నినాదాలతో రేషన్‌పై ఆధారపడే కుటుంబాన్ని సంపన్న కుటుంబంగా మార్చలేరు. పూర్తి రేషన్ సంచి అంటే నిండిన జేబు కాదు. పేదరికం ఓడిపోయిందని ప్రకటించే ప్రభుత్వం కాదు.. పేదరికంనుంచి ప్రజలను శాశ్వతంగా బయటపడేసే వ్యవస్థే భారతదేశానికి కావాలి.

అసంతృప్తుల వేళ అసమ్మతి గోల! కోమటిరెడ్డి వ్యూహమేమిటీ..?



హైదరాబాద్,పాము పగ.. తోక చుట్టం..! ఈ సామెత సల్లగొండ జిల్లాలో బాగా నానుడిలో ఉంది. దీని అర్థం.. పాము అంటే గిట్టదు.. మరి తోకతో దోస్తానా.. ఎందుకు? అని. అచ్చంగా ఇలాగే ఉంది కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తీరు. రేవంత్ సర్కార్ నచ్చలేదంటున్నాడు. అసలు అది పాలనే కాదంటున్నాడు. రేవంత్ తీరు పై తీవ్ర విమర్శలూ చేస్తున్నాడు. ఇదేం మాట తీరు..? ఇదేం పరిపాలన.. ? ఇట్ల చేస్తే కాంగ్రెస్ మళ్లీ వచ్చినట్టేనని నిష్ఠూరమాడుతున్నాడు. ఇంకా రెండేళ్ల సమయం ఉంది.. బాగా పాలించు..అని హితబోధ చేస్తూనే.. ఇక రెండోసారి నీకు సీఎం పదవి ఉండదు.. అని ఇన్‌డైరెక్టుగా సిగ్నల్ ఇస్తున్నాడు. అసలు కోమటిరెడ్డి మాటల్లో మర్మమేమిటీ? నేరుగా సీఎంను రెచ్చగొట్టి, బెదిరించే తీరు వెనుక ఉన్న వ్యూహమేమిటీ? ఆయనకు పార్టీలో దొరుకుతున్న మద్దతు ఏపాటిది?అధిష్టానం మాటిచ్చింది కోమటిరెడ్డికి. మంత్రి పదవి ఖాయంగా ఇస్తామని. కానీ మాట నిలబెట్టుకోలేకపోయింది. ఒకే ఇంట్లో ఇద్దరికా.. ? అనే కోణం ఒకటైతే, సామాజిక సమీకరణ మరో కోణం. అందుకే మాట తప్పారు. కానీ కోమటిరెడ్డి మాత్రం.. అధిష్టానం వెనుకడుగు వేయడాన్ని తప్పుబట్టాడు. మాటిచ్చినప్పుడు ఇది గుర్తు రాలేదా? తనకు 'అప్పగించిన పనిని నిర్విగ్నంగా చేశాను.. కాంగ్రెస్‌ను అధికారంలోకి తెచ్చే క్రమంలో ఢిల్లీ పెద్దలు తనపై పెట్టిన బాధ్యతలన్నీ నెరవేర్చాను. మరి ఇప్పుడు ఓడదాటినాకా బోడి మల్లన్న అనడం న్యాయమా?' అని నిలదీస్తూ వచ్చాడు.మూడేండ్ల కాలం ముగిసింది. రేపు, మాపు అని ఊరించినా..ఇస్తారని ఆశతో మొన్నటి వరకు ఎదురుచూసినా.. ఇక ఆ ఆశలపై నీళ్లు చల్లినట్టేనని రూడీ చేసుకున్నట్టున్నాడు కోమటిరెడ్డి. అందుకే తన నిరసన గళాన్ని కాస్త పెంచాడు. బెదిరింపులు, రెచ్చగొట్టే తన స్టైల్ పాలిటిక్స్‌కు మరింత పదును పెట్టాడు. నేరుగా సీఎంపైనే. ప్రధాన ప్రతిపక్ష నేతకు ఏ మాత్రం తగ్గని రీతిలో ... పార్టీకి, ప్రభుత్వానికి, వ్యక్తిగతంగా రేవంత్ రాజకీయానికి కూడా డ్యామేజీ చేసేలాగే ఆయన విపరీత కామెంట్స్ ఉంటున్నాయి.రాజకీయాల్లో ఇది ప్రస్తుతం హాట్ టాపిక్ గా మారగా.. పార్టీ అంతర్గతంగా తీవ్ర చర్చకు తెర తీసింది. కోమటిరెడ్డి ప్రకోపానికి, రెబల్ రాజకీయానికి కారణం.. మంత్రి పదవి రాకపోవడమేనా? అనే మొదటి ప్రశ్న, అనుమానానికి అవుననే సమాధానమే మెజారిటీ నుంచి వస్తోంది. అయితే.. ఈ ఒక్క కారణమే.. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిలో సహజంగా ఉండే రెబల్ మనస్తత్వాన్ని మరింత రెచ్చగొట్టి, ప్రోత్సహించినట్టయ్యింది. అందుకే ఇలా చెలరేగిపోతున్నాడని నిర్ధారణకు వచ్చిందట ఆ పార్టీ అధిష్టానం.ఈ మూడేండ్ల పాలనలో కాంగ్రెస్ పార్టీ నేతలు, ఎమ్మెల్యేలు తీవ్ర అసంతృప్తిలో ఉన్నారు. నిధులు రావడం లేదనేది ప్రధాన కారణం. పదవుల పంపకంలో తీవ్ర జాప్యమూ తీవ్ర సంతృప్తికి తావిస్తోంది. సరిగ్గా ఈ సందర్భాన్ని తన రెబల్ రాజకీయానికి కరెక్టుగా రాజగోపాల్ రెడ్డి వాడుకుంటున్నారంటున్నారు. కొత్త, పాత కలయికలో కాంగ్రెస్ పార్టీ సీనియర్లకు తగిన న్యాయం జరగడం లేదనే ప్రచారం మొదటి నుంచి ఉంది.రేవంత్ రెడ్డి తన వర్గాన్ని పెంచి పోషిస్తున్నారని, హార్డ్ కోర్ కాంగ్రెస్ నేతలకు తగిన న్యాయం జరగడం లేదనేది బాధిత వర్గంగా చెప్పుకుంటున్న ఆ పార్టీ నేతలు బాహాటంగానే కామెంట్స్ చేసుకుంటున్నారు. ఎలాగూ మంత్రి పదవి ఇవ్వరు. అది కన్ఫాం. మరి ఊరికనే ఉంటే రాజగోపాల్‌రెడ్డి ఎందుకవుతాడు? అందుకే ఇలా తనదైన రెబల్ రాజకీయానికి తెర తీశారంటున్నారు.అయితే రాజగోపాల్‌రెడ్డి కామెంట్స్‌ను ప్రతిపక్ష పార్టీలే కాదు.. ఆపార్టీలోని సీనియర్లు, కాంగ్రెస్ పార్టీ హార్డ్ కోర్ క్యాడర్ కూడా ఆసక్తిగా గమనిస్తోంది. వీరు రేవంత్ సర్కార్‌ను కాపాడే ప్రయత్నం చేయకపోగా.. మౌనంగా ఉండటం మూలంగా తమ సంఘీభావం అతనికి ఉందనే విధంగానే వారి ప్రవర్తన ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.'అవును .. రాజగోపాల్‌రెడ్డి మాటల్లో తప్పేముంది? వాస్తవాలే చెబుతున్నాడు.. కాకపోతే అది పార్టీకి నష్టం జరిగేలా బాహాటంగా చేస్తున్నాడు అంతే..! ఇప్పుడు పాలన, ప్రజల్లో ఉన్న అభిప్రాయాలు అందుకు భిన్నంగా ఏం లేవు కదా?' అనే విధంగా అతని వ్యవహార శైలిని సమర్థిస్తున్నట్టుగానే పార్టీ సీనియర్ల కామెంట్స్ ఉంటున్నాయట. ఈ పరిణామాలను గమనిస్తూ తన గళాన్ని మరింత పెంచుతూ పోవాలనే డిసైడ్ అయ్యాడట కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి.ఈ రెండేండ్ల కాలంలో వీలనైంతగా తన నియోజకవర్గం మునుగోడుకు నిధులు రాబట్టుకోవడం, పదవులు ఇప్పించుకోవడం ఓ వ్యూహమైతే.. కాంగ్రెస్ పార్టీ మేలు కోరి, భవిష్యత్తులో ఆ పార్టీ పటిష్టత కోసమే తన కామెంట్స్ తప్ప మరోటి కాదనే విధంగా తనకు తాను డిఫెన్స్ చేసుకునే ఎత్తుగడను కూడా ప్లే చేస్తున్నాడంటున్నారు.'రాహుల్‌ను ప్రధాని చేయడమే తన అంతిమ లక్ష్యమ'ని అనడం వెనుక.. తను పార్టీ మారబోనని సంకేతమిస్తూనే.. రేవంత్ వైఖరి సరిగ్గా లేదు.. నిధులు, పదువుల పంపకాల్లో అన్యాయం జరుగుతోందని చెప్పడం ఆ కామెంట్స్ వెనుక ఉన్న మర్మంగా చూస్తున్నారు. 'కాంగ్రెస్ పార్టీకి విశ్వాసపాత్రులం మేమే.. కష్టనష్టాల్లో తోడుంటాం' అని అసంతృప్తులను కలుపుకుని పోయేలా , రేవంత్ ను రెచ్చగొట్టేలా అతని ప్రసంగాలు కొనసాగుతున్నాయి.అంతిమంగా అధిష్టానం కోమటిరెడ్డి చర్యలను సమర్థించకపోయినా.. ఇక్కడ క్రమశిక్షణ కమిటీ కనీసం వార్నింగ్ కూడా ఇవ్వడం లేదంటే.. అతన్ని తక్కువ అంచనా వేయడం లేదనేది ఓ కోణమైతే.. చర్యల వల్ల మరింతగా చెలరేగిపోయే అవకాశం ఇవ్వడమని కూడా భావిస్తున్నట్టు తెలుస్తోంది.

సీతారాంపూర్ చేయూత పింఛన్లు పంపిణీ

కరీంనగర్, సీతారాంపూర్ ప్రభుత్వ చేయూత పథకంలో భాగంగా నూతనంగా మంజూరైన పింఛన్ల మంజూరు పత్రాలను 23వ డివిజన్ కార్పొరేటర్ గుమ్మడి రాజ్ కుమార్ అర్హులైన లబ్ధిదారులకు అందజేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పింఛన్ అందేలా కృషి చేస్తామని, పేద ప్రజలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని ఈ సందర్భంగా కార్పొరేటర్ తెలిపారు. పింఛన్ మంజూరుకు కృషి చేసిన కార్పొరేటర్‌కు లబ్ధిదారులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఆర్ సిసిఐ హ్యూమన్ రైట్స్ మహిళ వర్కింగ్ ఛైర్మెన్ పాదం అజంత పటేల్, కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు అండెం ప్రభాకర్, దుర్గం శివ, మహిళా సమాఖ్య రిసోర్స్ పర్సన్స్ కవిత, లావణ్య, వసంత, మిట్ట కుమార్ డివిజన్ ప్రజలు పాల్గొన్నారు.

గర్భకుర్తికి సింగిల్ విండో మంజూరు

చొప్పదండి,కరీంనగర్ జిల్లా గంగాధర మండలం గర్భకుర్తి గ్రామానికి నూతన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (సింగిల్ విండో) మంజూరు చేయించినందుకు చొప్పదండి నియోజకవర్గం ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకు గంగాధర మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా గర్భకుర్తి మరియు పరిసర గ్రామాల రైతులు ఎదుర్కొంటున్న విత్తనాలు, ఎరువులు మరియు వ్యవసాయ రుణాల సమస్యలను గుర్తించి, ప్రత్యేక చొరవతో సింగిల్ విండోను మంజూరు చేయించడం ఎమ్మెల్యే రైతు పక్షపాత వైఖరికి నిదర్శనమని కొనియాడారు. ఈ నూతన సహకార సంఘం ఏర్పాటుతో తమ ప్రాంత రైతులకు ఎంతో మేలు జరుగుతుందని, వ్యవసాయ సేవలు మరింత చేరువవుతాయని హర్షం వ్యక్తం చేశారు. రైతుల సంక్షేమం కోసం నిరంతరం శ్రమిస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కు మండల కాంగ్రెస్ శ్రేణులు మరియు గ్రామ రైతుల తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతూ చిరు సత్కారం చేశారు.ఈ కార్యక్రమంలోమండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మంత్రి మహేందర్,జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు పురుమల్ల మనోహర్,జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి రొమాల రమేష్,మహిళా కాంగ్రెస్ మండల అధ్యక్షురాలు చిరుత మంగ,బ్లాక్ అధ్యక్షురాలు తోట సంధ్య,సర్పంచ్ ల ఫోరం అధ్యక్షులు ముద్దం నగేష్,సర్పంచ్ లు రేండ్ల శ్రీనివాస్,బీర్ల ఆనంద్,రాచమల్ల రవి,గుండవేని లావణ్య తిరుపతి,గుడి రజిని ప్రవీణ్ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ నాయకులు కంకణాల రాజ గోపాల్ రెడ్డి, చిప్ప చక్రపాణి,గుండా రాజేశం,పొత్తూరి ప్రభాకర్,అత్తపురం తిరుపతి,అన్నల్దాస్ శ్రీను,కడారి కుమార స్వామి,చిందం శ్రీధర్,మల్లికార్జున్,సాయిని ఐలయ్య,నరేష్,సుధాకర్, రామంచ రాజు మహిళా కాంగ్రెస్ నాయకులు భారతి,కవిత,రమ్య మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పథకాల అమలు

చోప్పదండి,బోయినపల్లి మండలంలోని 567మంది లబ్ధిదారులకు పెన్షన్ మంజూరు పత్రాలు అందించిన జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంప్రజా సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పథకాలు అమలు చేస్తుందని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం తెలిపారు.ముందుగా జయ జయహే తెలంగాణ గీతంతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు ప్రభుత్వ పథకాలు, చేయూత పెన్షన్ మంజూరుపై పాటల ద్వారా వివరించారు.బోయినపల్లి మండలంలోని 567మంది లబ్ధిదారులకు బోయినపల్లి మండలం కొత్తపేట గ్రామంలో పెన్షన్ మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ముఖ్య అతిథిగా హాజరై అందజేశారు.జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. చేయూత పెన్షన్ కోసం ఇప్పటికే దరఖాస్తుదారులు స్వీకరించామని తెలిపారు. అర్హుల ఎంపిక కోసం గ్రామ, మండల, జిల్లా స్థాయి అధికారులతో విచారణ

సింగరేణిలో అప్రెంటిస్‌లతో కూలి పనులా?



భద్రాద్రి : సాంకేతిక నైపుణ్యాలు పెంపొందించుకోవాల్సిన అప్రెంటిస్‌లతో సింగరేణి సెంట్రల్ వర్క్‌షాప్‌లో కూలి పనులు చేయిస్తున్నారనే ఆరోపణలు చర్చనీయాంశంగా మారాయి. ఐటీఐలో ఎలక్ట్రిషియన్ కోర్సు పూర్తి చేసి అప్రెంటిస్‌షిప్‌కు చేరిన అభ్యర్థులకు ట్రేడ్‌కు సంబంధించిన సాంకేతిక శిక్షణ అందించాల్సి ఉండగా, వారితో మట్టి పనులు, పైపుల తొలగింపు, ఫెన్సింగ్ ఏర్పాటు, గడ్డి తొలగింపు, గుంతలు తవ్వడం, పోల్స్ పాతించడం వంటి శారీరక శ్రమతో కూడిన పనులు చేయిస్తున్నారని అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎలక్ట్రికల్ పరికరాలు, వైరింగ్, మోటార్లు, ఎలక్ట్రికల్ నిర్వహణ వంటి అంశాల్లో అనుభవం పొందాల్సిన తమను కూలీల మాదిరిగా పనులకు వినియోగించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు. సెంట్రల్ వర్క్‌షాప్ జీఎం రామ్మోహన్‌రావు వ్యవహారశైలిపై కూడా అభ్యర్థులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. తాను చెప్పిన పనులు చేయకపోతే వెనక్కి పంపిస్తానంటూ హెచ్చరిస్తున్నారని వారు పేర్కొంటున్నారు. ఎలక్ట్రిషియన్ అభ్యర్థులతో ఫెన్సింగ్ గుంతలు తవ్వించి పోల్స్ పాతించడం ఇందుకు నిదర్శనంగా చెబుతున్నారు. అప్రెంటిస్‌షిప్ అనేది యువతకు వృత్తిపరమైన నైపుణ్యాలు అందించి ఉపాధికి సిద్ధం చేసే శిక్షణ కార్యక్రమమని, ఆ లక్ష్యానికి విరుద్ధంగా ఇతర పనులు చేయించడం వల్ల తమ భవిష్యత్తు దెబ్బతింటుందని అభ్యర్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో అప్రెంటిస్‌లతో ఎలాంటి పనులు చేయిస్తున్నారు? వారికి నిర్దేశిత ట్రేడ్‌లో తగిన శిక్షణ అందుతోందా? అనే అంశాలపై సింగరేణి ఉన్నతాధికారులు విచారణ చేపట్టాలని కోరుతున్నారు. ఆరోపణలపై సంబంధిత అధికారులు స్పందించి అప్రెంటిస్‌లకు వారి ట్రేడ్‌కు అనుగుణంగా సాంకేతిక శిక్షణ అందించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

కాంగ్రెస్ మిషన్- 2029.. పార్టీలో భారీగా ప్రక్షాళన, రాహుల్ 'సామాజిక న్యాయం' మార్క్



న్యూఢిల్లీ,2029లో జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు ఇప్పటినుంచి పార్టీలు రెడీ అవుతున్నాయి. జాతీయ, ప్రాంతీయ పార్టీల్లో భారీగా మార్పులు చేర్పులు చేటు చేసుకుంటున్నాయి. ఈ విషయంలో కాంగ్రెస్ పార్టీ భారీ ప్రక్షాళన మొదలుపెట్టింది. అంతేకాదు రాహుల్ 'సామాజిక న్యాయం' మార్క్ స్పష్టంగా కనిపిస్తోంది.కొత్త నియమించిన పార్టీ కార్యదర్శుల్లో 50 శాతం మంది ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ వర్గాలకు చెందినవారే ఉన్నారు.

కాంగ్రెస్ మిషన్- 2029 మొదలు

2029 ఎన్నికల్లో కేంద్రంలో అధికారంలోకి రావాలని ఉవ్విళ్లూరుతోంది కాంగ్రెస్ పార్టీ. కేవలం మాటలతో మాత్రమే చేతలతో చేసి చూపిస్తోంది. అందుకు అనుగుణంగా అడుగులు వేస్తోంది. సామాజిక మార్క్ దిశగా అడుగులు వేస్తోంది. పార్టీలో ఎక్కడ మార్పులు జరిగినా అగ్రనేత రాహుల్‌గాంధీ మార్క్ స్పష్టంగా కనిపిస్తోంది. 2029 లోక్‌సభ ఎన్నికలే లక్ష్యంగా కాంగ్రెస్ వ్యూహం మొదలు పెట్టింది. కీలక విభాగాలకు కొత్త సారథులను నియమించింది. పాతవారికి చెక్ పెడుతూ యువత, కొత్తవారికి పట్టం కట్టింది.

పార్టీలో భారీగా ప్రక్షాళన, రాహుల్ సామాజిక మార్క్

పునర్వ్యవస్థీకరణలో భాగంగా వివిధ రాష్ట్రాలు, సంస్థాగత విభాగాలకు 81 మంది జాతీయ కార్యదర్శులను నియమించింది. కొత్తగా నియమితులైన వారిలో 43 మంది కొత్తవారు ఉన్నారు. గతంలో వివిధ పదవుల్లో ఉన్న రెండు డజన్ల మందిని తొలగించింది. ఈ నియామకాల్లో అగ్రనేత రాహుల్‌గాంధీ ఆలోచనలకు అనుగుణంగా 'సామాజిక న్యాయం' ఫార్ములాకు పెద్దపీట వేశారు.మొత్తం 81 మంది కార్యదర్శుల్లో దాదాపు 50 శాతం మంది ఎస్సీ,ఎస్టీ,బీసీ, మైనార్టీ వర్గాలకు చెందినవారు ఉన్నారు.29 మంది సాధారణ వర్గానికి చెందినవారు ఉన్నారు. 20 మంది ఓబీసీ వర్గం, ఐదుగురు అత్యంత వెనుకబడిన తరగతుల-ఈబీసీ,11 మంది ఎస్సీ వర్గం, ఐదుగురు ఎస్టీ వర్గానికి చెందినవారు.11 మ ంది మైనారిటీ వర్గాలకు చెందినవారు ఉన్నారు. కార్యదర్శులలో దాదాపు మూడింట రెండు వంతుల మంది ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనారిటీ వర్గాల నేతలు ఉన్నారు.

సీనియారిటీకి.. మైనారిటీకి పట్టం..!



కర్నూలు,ఉమ్మడి కర్నూలు జిల్లాలో జిల్లా పరిషత్ పీఠాల ఎంపికకు రంగం సిద్ధమైంది. సీనియారిటీ, సామాజిక సమీకరణాలు, మైనారిటీలకు ప్రాతినిధ్యం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకున్న కూటమి అధిష్టానం.. కర్నూలు, నంద్యాల జిల్లాల జడ్పీ చైర్మన్, వైస్ చైర్మన్ అభ్యర్థులను ఖరారు చేసింది. కర్నూలు జిల్లా పరిషత్ చైర్మన్‌గా కౌతాళం జడ్పీటీసీ చూడి ఉలిగయ్య, వైస్ చైర్మన్‌గా దేవనకొండ జడ్పీటీసీ షేక్ సాధిక పేర్లను నిర్ణయించింది. నంద్యాల జిల్లా తొలి జడ్పీ చైర్మన్‌గా బనగానపల్లె జడ్పీటీసీ షేక్ బ్రుహానుద్దీన్, వైస్ చైర్మన్‌గా శిరివెళ్ల జడ్పీటీసీ కె. శ్రీకాంత్‌రెడ్డిని ఎంపిక చేసింది.జిల్లా పరిషత్ చైర్మన్లు, వైస్ చైర్మన్ల ఎవరనే ఉత్కంఠకు కూటమి అధిష్టానం తెరదించింది. రాజకీయ అనుభవం, పార్టీ పట్ల విధేయతతో పాటు సామాజిక సమీకరణాలకు ప్రాధాన్యతనిస్తూ అభ్యర్థులను ఎంపిక చేసినట్లు పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. కర్నూలు జిల్లా చైర్మన్ పీఠాన్ని పార్టీ ఆవిర్భావం నుంచి పనిచేస్తున్న సీనియర్ నాయకుడు చూడి ఉలిగయ్యకు కేటాయించాలని నిర్ణయించగా.. నంద్యాల జిల్లా తొలి చైర్మన్ పదవిని మైనారిటీ వర్గానికి చెందిన షేక్ బ్రుహానుద్దీన్‌కు కేటాయించింది. అదే సమయంలో రెండు జిల్లాల్లో వైస్ చైర్మన్ అభ్యర్థుల ఎంపికలోనూ సామాజిక, రాజకీయ సమీకరణాలను పరిగణనలోకి తీసుకున్నట్లు తెలుస్తోంది.జిల్లా పరిషత్ ఎన్నికల ప్రక్రియలో భాగంగా ముందుగా కో-ఆప్షన్ సభ్యుల ఎన్నిక నిర్వహించనున్నారు. అనంతరం నూతనంగా ఎన్నికైన జడ్పీటీసీ సభ్యులతో జిల్లా కలెక్టర్లు ప్రమాణ స్వీకారం చేయిస్తారు. ఆ తర్వాత చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికకు సంబంధించిన నోటిఫికేషన్‌ను సమావేశంలో చదివి వినిపిస్తారు. అభ్యర్థుల ఎంపిక ప్రక్రియను చేతులెత్తే విధానం ద్వారా నిర్వహించనున్నారు. ఈ ఎన్నికల నిర్వహణకు ఇరు జిల్లాల అధికార యంత్రాంగం అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేసింది.

సీనియారిటీకి కర్నూలు జడ్పీ చైర్మన్ పీఠం:

కర్నూలు జిల్లా పరిషత్ చైర్మన్ పీఠం సీనియర్ నాయకుడు చూడి ఉలిగయ్యకు దక్కనుంది. కౌతాళం మండలం గోతులదొడ్డికి చెందిన ఆయన పార్టీ ఆవిర్భావం నుంచి తెలుగుదేశం పార్టీలో కొనసాగుతున్నారు. గతంలో సర్పంచ్‌గా, ఏపీ వాల్మీకి ఫెడరేషన్ డైరెక్టర్ గా పనిచేశారు. మంత్రాలయం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి నాలుగుసార్లు ఎమ్మెల్యే టికెట్ ఆశించినప్పటికీ వివిధ రాజకీయ, సామాజిక సమీకరణాల నేపథ్యంలో అవకాశం దక్కలేదు. అయినప్పటికీ పార్టీని వీడకుండా, పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ తన రాజకీయ ప్రస్థానాన్ని కొనసాగించారు. దీర్ఘకాలంగా పార్టీకి అందించిన సేవలు, రాజకీయ అనుభవం, పార్టీ పట్ల విధేయతను గుర్తించిన అధిష్టానం ఆయనకు జిల్లా పరిషత్ చైర్మన్ బాధ్యతలు అప్పగించాలని నిర్ణయించినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

ఈ పదవి కోసం దేవనకొండ జడ్పీటీసీ షేక్ సాధికతో పాటు తుగ్గలి జడ్పీటీసీ మిద్దె గీతాకుమారి, ఆదోని-2 జడ్పీటీసీ కురువ శంకరమ్మ, హోళగుంద టీడీపీ రెబల్ జడ్పీటీసీ గోవింద్ గౌడ్ తదితరులు ప్రయత్నించినట్లు సమాచారం. చివరకు ఉలిగయ్య వైపు అధిష్టానం మొగ్గు చూపింది. చైర్మన్ పదవిని ఆశించిన షేక్ సాధికకు వైస్ చైర్మన్ అభ్యర్థిగా అవకాశం కల్పించడం ద్వారా కర్నూలు జిల్లా పరిషత్‌లో సీనియారిటీతో పాటు మైనారిటీ ప్రాతినిధ్యానికీ ప్రాధాన్యత ఇచ్చినట్లయింది. ఈ ఎంపికతో పార్టీ నాయకులు, కార్యకర్తల్లో నెలకొన్న ఉత్కంఠకు తెరపడినట్లయింది.

నంద్యాల తొలి జడ్పీ పీఠం మైనారిటీకి:

నూతనంగా ఏర్పడిన నంద్యాల జిల్లా పరిషత్‌కు తొలి చైర్మన్‌గా షేక్ బ్రుహానుద్దీన్ పేరు ఖరారైంది. బనగానపల్లె మండలానికి చెందిన ఆయన 2012 నుంచి తెలుగుదేశం పార్టీలో కొనసాగుతున్నారు. మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డికి సన్నిహితంగా ఉంటూ పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్నట్లు స్థానిక రాజకీయ వర్గాల్లో గుర్తింపు ఉంది. జడ్పీటీసీగా కూడా ఆయన ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాష్ట్రస్థాయిలో మైనారిటీ వర్గాలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలనే ఉద్దేశంతో నంద్యాల జిల్లా తొలి జడ్పీ చైర్మన్ పీఠాన్ని ఆ వర్గానికి కేటాయించినట్లు పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది.చైర్మన్ పదవిని ఆశించిన శిరివెళ్ల జడ్పీటీసీ కె. శ్రీకాంత్‌రెడ్డికి వైస్ చైర్మన్ అభ్యర్థిగా అవకాశం కల్పించారు. దీంతో నంద్యాల జిల్లా పరిషత్ తొలి పాలకవర్గంలో చైర్మన్, వైస్ చైర్మన్ పదవులకు అభ్యర్థుల ఎంపిక పూర్తయింది. కర్నూలు జిల్లాలో వైస్ చైర్మన్ పదవిని మైనారిటీ వర్గానికి కేటాయించగా, నంద్యాలలో చైర్మన్ పదవిని అదే వర్గానికి కేటాయించడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. రెండు జిల్లాల్లోనూ సామాజిక సమీకరణాలు, కూటమి భాగస్వామ్య పక్షాల మధ్య సమన్వయం, పార్టీ నేతల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని ఈ ఎంపికలు చేసినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది.

కూటమి శ్రేణుల్లో ఉత్కంఠకు తెర:

రెండు జిల్లాల జిల్లా పరిషత్ పీఠాలకు అభ్యర్థుల పేర్లు ఖరారు కావడంతో కూటమి నాయకులు, కార్యకర్తల్లో నెలకొన్న ఉత్కంఠకు తెరపడింది. కర్నూలులో సీనియర్ నాయకుడికి చైర్మన్ బాధ్యతలు అప్పగించాలని నిర్ణయించగా, నంద్యాలలో మైనారిటీ వర్గానికి చెందిన నాయకుడికి తొలి చైర్మన్ పదవిని కేటాయించారు. వైస్ చైర్మన్ పదవుల ఎంపికలోనూ ఆయా జిల్లాల రాజకీయ, సామాజిక సమీకరణాలను పరిగణనలోకి తీసుకున్నారు. మొత్తం మీద జిల్లా పరిషత్ చైర్మన్లు, వైస్ చైర్మన్ల ఎవరు..? అనే ఉత్కంఠకు తెరపడింది. మరి కొత్త చైర్మన్లు జిల్లా అభివృద్ధి కి ఎంత వరకు కృషి చేస్తారో..? తెలియాలి అంటే కొంత కాలం వేచి చూడాల్సిందే..!!!

గచ్చిబౌలి పీజీ హాస్టల్‌లో డ్రగ్స్ కలకలం..



హైదరాబాద్, గచ్చిబౌలిలోని ఓ పురుషుల పీజీ హాస్టల్‌లో డ్రగ్స్ కలకలం రేగింది. తెలంగాణ ఈగల్ ఫోర్స్ అధికారులు గురువారం నిర్వహించిన ఆకస్మిక తనిఖీల్లో ఆరుగురు గంజాయి వినియోగించినట్లు గుర్తించారు. హాస్టల్‌లో ఉంటున్న ఎనిమిది మందికి మూత్ర నమూనాలతో డ్రగ్స్ పరీక్షలు నిర్వహించగా.. ఆరుగురికి గంజాయిలో ఉండే మత్తు పదార్థం టెట్రాహైడ్రోకన్నబినాల్ (టీహెచ్‌సీ) పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. మరో ఇద్దరికి నెగెటివ్‌గా వచ్చింది.విశ్వసనీయ సమాచారం మేరకు మాదాపూర్ పరిధిలోని సిద్దిక్‌నగర్‌లో ఉన్న హరిహర జ్ఞానేశ్వర పురుషుల పీజీ హాస్టల్‌పై ఈగల్ ఫోర్స్ అధికారులు దాడులు నిర్వహించారు. తనిఖీల్లో భాగంగా హాస్టల్‌లో నివసిస్తున్న ఎనిమిది మందికి పరీక్షలు చేయగా ఆరుగురు గంజాయి వినియోగించినట్లు ప్రాథమికంగా తేలింది. వీరిలో ముగ్గురు ఈ-కామర్స్ డెలివరీ ఉద్యోగులు, ఇద్దరు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు, ఒకరు ఫార్మసిస్ట్‌గా పనిచేస్తున్నట్లు అధికారులు గుర్తించారు.దాడుల సమయంలో ఇద్దరు నివాసితుల నుంచి 15 గ్రాముల గంజాయితో పాటు ముందుగానే చుట్టి ఉంచిన ప్రీ రోల్డ్ కోన్స్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. విచారణలో ముగ్గురు వ్యక్తుల నుంచి గంజాయి కొనుగోలు చేస్తున్నట్లు సమాచారం రావడంతో బబులు ఠాకూర్ అలియాస్ బబ్లూ, ధాపన్, కృష్ణ అనే వ్యక్తులను అనుమానిత సరఫరాదారులుగా గుర్తించారు. ఐదు గ్రాముల గంజాయి ప్యాకెట్‌కు సుమారు రూ.600 వసూలు చేస్తున్నట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైనట్లు సమాచారం.

అయోధ్యలో నాతో తలపడే ధైర్యముందా?.. అఖిలేశ్‌కు యోగి ఆదిత్యనాథ్ సవాల్



గోరఖ్‌పూర్: అయోధ్యలో తనపై నేరుగా పోటీ చేసే ధైర్యం సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్‌కు లేదని ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ అన్నారు. అఖిలేశ్ తనపై పోటీకి దిగితే తానూ సిద్ధమని సవాల్ చేశారు. గురువారం గోరఖ్‌పూర్ జిల్లా క్యాంపియర్‌గంజ్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.అఖిలేశ్ పేరును నేరుగా ప్రస్తావించకుండా 'నేను అయోధ్య నుంచి పోటీ చేయాలని మీరు అన్నారు. సరే... మీరు నామినేషన్ దాఖలు చేయండి. నేనూ దాఖలు చేస్తాను. ఒక్కసారి నేరుగా తలపడదాం. మీరు ఎందుకు అనవసరంగా ఆందోళన చెందుతున్నారు?' అని అన్నారు.'మీకు ముఖాముఖిగా పోరాడే ధైర్యం లేదు. బలహీనుడు ఎప్పుడూ ముఖాముఖిగా పోరాడడు. వెనుక నుంచి దాడి చేస్తాడు. ఈ పిరికివాళ్ల పరిస్థితి కూడా ఇదే' అని వ్యాఖ్యానించారు. అఖిలేశ్ ఇటీవల అయోధ్యను సందర్శించి, ఆలయ నగరం నుంచి యోగి పోటీ చేయాలని సవాల్ చేయడంతో బీజేపీ, ఎస్పీ మధ్య మాటల యుద్ధం కొనసాగుతున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి ఈ వ్యాఖ్యలు చేశారు.రామాలయ ఉద్యమాన్ని ఈ సందర్భంగా యోగి ఆదిత్యనాథ్ ప్రస్తావిస్తూ, రామభక్తులపై కాల్పులు జరిపినవారు, వారిపై లాఠీలు ప్రయోగించినవారు, హిందూ విశ్వాసాలతో చెలగాటమాడినవారే ఇప్పుడు రాముడిని స్మరిస్తున్నారని ఆరోపించారు. భక్తులు తమ మంచి సమయాల్లో రాముడిని స్మరిస్తారు. కానీ నిద్రపోతున్నప్పుడు, మేల్కొన్నప్పుడు, కూర్చున్నప్పుడు, నిలబడినప్పుడు.. ఇలా అన్ని వేళలా రాముడిని స్మరించే భక్తుడిని రాముడు కాపాడుతాడని అన్నారు. సీతను అపహరించేందుకు రావణుడికి సహకరించిన రాక్షసుడు మారీచుడిని ప్రస్తావిస్తూ, దుష్టుల అంతం సమీపించినప్పుడు వారు కూడా రాముడి పేరును ఉచ్చరిస్తారని, మారీచుడి వేషంలో వచ్చే ఈ వ్యక్తులను అర్థం చేసుకోవాలని అన్నారు.

ఒవైసికి కానుక ఇస్తాం..

చంద్రశేఖర్ ఆజాద్ నేతృత్వంలోని ఆజాద్ సమాజ్ పార్టీ, ఏఐఎంఐఎం అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ కలిసి 2027 ఉత్తరప్రదేశ్ ఎన్నికల్లో పోటీ చేయనున్నట్లు ప్రకటించిన విషయాన్ని ప్రస్తావిస్తూ.. 'హైదరాబాద్ మౌలానా కూడా అందోళన చెందుతున్నాడు' అని యోగి అన్నారు. సమయం వచ్చినప్పుడు హైదరాబాద్‌ను 'భాగ్యలక్ష్మీపురం'గా మార్చే కానుక ఇస్తామని వ్యాఖ్యానించారు. అవకాశం వచ్చినప్పుడల్లా ప్రతిపక్ష పార్టీలన్నీ ఒకేలా వ్యవహరించి అశాంతిని వ్యాపింపజేశాయని ఆయన ఆరోపించారు. ఇలాంటి పార్టీలను ఉత్తరప్రదేశ్ ప్రజలు పదేపదే తిరస్కరించారని, 2027 అసెంబ్లీ ఎన్నికలకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. 'ఎన్నికల రణరంగం సిద్ధంగా ఉంది' అని స్పష్టం చేశారు.

రాజగోపాల్ రెడ్డిని సస్పెండ్ చేయగలరా?



హైదరాబాద్,తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పదే పదే పార్టీ గీత దాటుతూ సొంత ప్రభుత్వంపై, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై ఘాటు విమర్శలు చేస్తున్నప్పటికీ.. అధిష్టానం ఇప్పటివరకు కఠిన చర్యలు తీసుకోలేకపోవడం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీసింది. అయితే, తాజాగా మునుగోడు వేదికగా ముఖ్యమంత్రిని ఉద్దేశించి ఆయన చేసిన సంచలన వ్యాఖ్యల వీడియో క్లిప్పింగ్‌లను టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ఏఐసీసీకి పంపించడంతో, ఈసారైనా వేటు పడుతుందా అనే ఆసక్తి నెలకొంది.

రాజగోపాల్ రెడ్డి ప్లానేంటి?

రాజగోపాల్ రెడ్డి వ్యవహారశైలి వెనుక రెండు ప్రధాన కోణాలు కనిపిస్తున్నాయి.ఒకటి ఫిరాయింపుల చట్టం కింద అనర్హత వేటు పడకుండా పార్టీయే తనను సస్పెండ్ చేసేలా రెచ్చగొట్టడం కాగా, రెండోది త్వరలో జరగబోయే కేబినెట్ విస్తరణలో తనకు మంత్రి పదవి దక్కేలా హైకమాండ్‌పై ఒత్తిడి తెచ్చే ప్రెజర్ పాలిటిక్స్ . అయితే, రాజగోపాల్ రెడ్డి అనుసరిస్తున్న ఈ దూకుడు వ్యూహం ఆయనకే రివర్స్ అయ్యే ప్రమాదం ఉందని కాంగ్రెస్ సీనియర్ నేతలు అభిప్రాయపడుతున్నారు. నిజానికి, ఇలా పదే పదే బహిరంగంగా క్రమశిక్షణ ఉల్లంఘించడం వల్ల ఢిల్లీ అధిష్టానం వద్ద ఆయన పలుకుబడి పెరగకపోగా, మరింత తగ్గిపోయే అవకాశం ఉందని రాజకీయ పరిశీలకులు చెబుతున్నారు. పార్టీలో గట్టి వాయిస్ ఉన్న నేతగా గుర్తింపు పొందినప్పటికీ, ఇప్పుడు కేవలం వ్యక్తిగత పదవుల కోసమే ప్రభుత్వ ప్రతిష్టను దెబ్బతీస్తున్నారనే అభిప్రాయం హైకమాండ్ పెద్దల్లో బలపడితే, రాబోయే రోజుల్లో అధిష్టానం ఆయన్ను పూర్తిగా లెక్కలోకి తీసుకోకుండా పక్కన పెట్టే పరిస్థితి ఏర్పడుతుందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.

హైకమాండ్ వద్ద పెరిగిన రేవంత్ పలుకుబడి

మరోవైపు, ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అధిష్టానం వద్ద, అలాగే ప్రభుత్వంలోనూ బలమైన పట్టు ఏర్పడిందనేది కాదనలేని వాస్తవమని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. ఇటీవలి పరిణామాల తర్వాత సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వానికి ఢిల్లీ పెద్దల పూర్తి అండదండలు ఉన్నాయని, ఇలాంటి సమయంలో ముఖ్యమంత్రిని నేరుగా లక్ష్యంగా చేసుకోవడం ద్వారా రాజగోపాల్ రెడ్డి తన రాజకీయ భవిష్యత్తును తానే ఇరకాటంలో పెట్టుకుంటున్నారని ఒక వర్గం నేతలు భావిస్తున్నారు. మరోవైపు, ఆయన సోదరుడు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మంత్రివర్గంలో కీలక బాధ్యతల్లో ఉండటం, అలాగే సస్పెండ్ చేస్తే మునుగోడులో రాజకీయ సమీకరణాలు మారతాయనే ఆలోచనతోనే హైకమాండ్ ఇప్పటివరకు సంయమనం పాటిస్తూ వచ్చిందని తెలుస్తోంది.

హైకమాండ్ నిర్ణయం ఎలా ఉంటుంది?

ఢిల్లీకి చేరిన వీడియోల పరిశీలన తర్వాత ఏఐసీసీ తీసుకోబోయే నిర్ణయం ఇప్పుడు అత్యంత కీలకంగా మారింది. ఒకవేళ ఆయన్ను సస్పెండ్ చేస్తే, ఆయన కోరుకున్నట్లే విముక్తి లభించి ఇతర పార్టీల వైపు చూసే అవకాశం దక్కుతుందని, అలా కాకుండా షోకాజ్ నోటీసు ఇచ్చి పార్టీలో ప్రాధాన్యత తగ్గించడం ద్వారానే అధిష్టానం ఆయన్ను రాజకీయంగా కట్టడి చేసే వ్యూహాన్ని అమలు చేయవచ్చని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

పెరిగే సీట్లు వైసీపీ రాజకీయాన్ని మంచేస్తాయా ?



అమరావతి,డీలిమిటేషన్ బిల్లుని ఆమోదించుకునే ఈ ఏడాది క్యాలెండర్ ని తిప్పాలని కేంద్రంలోని బీజేపీ నాయకత్వంలోని ఎన్డీయే సర్కార్ గట్టిగా డిసైడ్ అయింది. దాని కోసం చేయాల్సిన కసరత్తు అంతా చేస్తున్నారు. డీలిమిటేషన్ బిల్లు ఆమోదం పొందడానికి ఒకసారి అయితే గురి తప్పింది. ఈసారి అలా జరగదు అన్న ధీమాతో కాషాయ దళం ఉంది. ఈ ఏడాదిలోనే డీలిమిటేషన్ బిల్లు ఆమోదం ఎందుకు అంటే 2029 ఎన్నికల్లో పెరిగిన సీట్లతో పార్లమెంట్ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ పడాలని బీజేపీ సహా ఎన్డీయే మిత్రులు పట్టుదలగా ఉన్నారని అంటున్నారు. అందుకు సమయం ఉండాలి అంటే 2026 లో డీలిమిటేషన్ బిల్లు ఆమోదం పొందాల్సి ఉంది.

ఏపీలో పెద్ద నంబర్ :

ఇదిలా ఉంటే డీలిమిటేషన్ బిల్లు కనుక పార్లమెంట్ ఆమోదం పొందితే పార్లమెంట్ అసెంబ్లీ సీట్లలో కూడా ఉన్న సీట్లలో సగం సీట్లు పెరుగుతాయని అంటున్నారు. ఈ లెక్కన చూస్తే ప్రస్తుతం ఏపీలో 175 సీట్లు ఉన్నాయి. ఇవి కాస్తా 263 దాకా అవుతాయని అంటున్నారు. అంటే పెద్ద నంబర్ అన్న మాట. ఉమ్మడి ఏపీలో ఉన్న 294 సీట్లకు 31 మాత్రమే తక్కువ. అంటే మళ్ళీ ఎంతో మందికి రాజకీయంగా చాన్స్ దక్కేలా ఈ సీట్ల కూర్పు ఉండబోతోంది అని అంటున్నారు. పెద్ద అసెంబ్లీ నియోజకవర్గాలు రెండు లేదా మూడు అవుతాయని అంటున్నారు. ఇక కనీసంగా రెండు లక్షల జనాభాకు ఒక అసెంబ్లీ సీటు అని కూడా నిర్దేశించుకుని మరీ ఈ విభజన ఉండబోతోంది అని అంటున్నారు.

పొత్తులకు ఈజీ :

ఇక కూటమికి ఈ పెరిగిన సీట్ల వల్ల భారీగా రాజకీయ లాభం కలుగుతుందని అంటున్నారు. వచ్చే ఎన్నికల్లో ఇప్పటి కంటే అధికంగా సీట్లకు పోటీ పడాలని బీజేపీ జనసేన భావిస్తున్నాయి. ముఖ్యంగా జనసేన విషయం తీసుకుంటే 21 సీట్లతో ప్రస్తుతం ఉన్న ఆ పార్టీ కనీసంగా యాభై సీట్లు కోరుతుందని అంటున్నారు. అలాగే బీజేపీకి 2024లో 10 సీట్లు ఇచ్చారు. వచ్చే ఎన్నికల నాటికి 15 సీట్లు ఇచ్చినా కూటమిలో పెద్దన్న టీడీపీకి 200 సీట్ల దాకా పోటీ చేసే అవకాశాలు ఉంటాయి. దాంతో టీడీపీలో ఆశావహులు అందరికీ సర్దుబాటు చేసుకోవచ్చు అని భావిస్తున్నారు. అలాగే పటిష్టమైన పొత్తు బంధంతో మరోసారి 2029 లో సూపర్ హిట్ కొట్టవచ్చు అన్న ధీమా కూడా కనిపిస్తోంది.

ఆపరేషన్ ఆకర్ష్ :

ఇక వైసీపీని 2024 లో ఓటమి తరువాత ఎక్కడికక్కడ కట్టడి చేయడమే కాకుండా కీలక జిల్లాలలో ముఖ్య నేతలను కూటమి చేర్చుకుంది. ఇటీవల స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా ద్వితీయ తృతీయ శ్రేణి నేతలనే కాదు పంచాయతీ స్థాయిలో ఉన్న నాయకులను కూడా కూటమి పార్టీలు టార్గెట్ చేసి మరీ చేర్చుకున్నాయి. అలా క్షేత్ర స్థాయిలో దెబ్బ తీయాలని వ్యూహంగా ఉంది. ఇక ఈ ఎన్నికలు ముగిసిన తరువాత మరోసారి వైసీపీ మీద ఆపరేషన్ ఆకర్ష్ ని ప్రయోగించి జిల్లా స్థాయిలో నియోజకవర్గాల స్థాయిలో కీలక నేతలను చేర్చుకునే కార్యక్రమం చేపడతారు అని అంటున్నారు. అలా వచ్చే ఎన్నికల నాటికి వైసీపీని సంస్థాగతంగా గట్టి దెబ్బ తీస్తే ఎన్నికల ముందే గెలిచినట్లు అవుతుందని కూటమి భావిస్తోంది అని ప్రచారం సాగుతోంది. ఇక ఏపీలో పెరిగిన సీట్లలో ఇలా వచ్చిన వారికి సర్దుబాటు చేయడం ఏమీ కష్టం కాబోదని అంటున్నారు.చూడాలి మరి కూటమి నుంచి కాచుకుని వైసీపీ తన పార్టీని 2029 ఎన్నికల దాకా ఎలా కాపాడుకుని వస్తుందో.

Edited, Printed, Published & owned by KOTAGIRI CHANDRA SHEKAR, Published From, H.NO.5-7-163 PRAKASHAM BAZAR, NALGONDA TOWN, TELANGANA- 508 001, Printed at KOTAGIRI GRAPHICS & KOTAGIRI OFFSET PRINTER, H.NO.5-7-163 PRAKASHAM BAZAR, NALGONDA TOWN, TELANGANA- 508 001. Editor: KOTAGIRI CHANDRA SHEKAR, RNINo. TELTEL/2022/86880, Cell:9440164140